తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

ఆదివారం

28 జూన్ 2026



# ప్రకృతి పొలంలో 'డిజిటల్' సాగు

# శ్రీను వైట్ల దర్శకత్వంలో శర్వానంద్

శర్వానంద్ ప్రస్తుతం సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'భోగి' చిత్రంతో బిజీగా ఉన్నాడు. ఈ సినిమాను ఆగస్టు 28న థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. 'భోగి' షూటింగ్ పూర్తి కాగానే, శర్వానంద్ డైరెక్టర్ శ్రీను వైట్ల దర్శకత్వంలో ఒక సినిమా చేయనున్నట్లు తాజా సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనులు చివరి దశకు చేరుకోగా, ఈ ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌కు 'జార్జ్ క్రిష్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.



ఇందులో శర్వానంద్ సరసన నటించేందుకు యంగ్ బ్యూటీ ప్రీతి ముకుందన్‌ను హీరోయిన్‌గా సెలెక్ట్ చేసినట్లు తెలుస్తోంది. గతంలో మంచు విష్ణు హీరోగా నటించిన 'కన్నప్ప' చిత్రంతో తెలుగు ఇండస్ట్రీలోకి ప్రీతి అడుగుపెట్టింది. రీసెంట్‌గా 'బ్లాస్ట్' చిత్రంతో బాక్సాఫీస్ దగ్గర సందడి చేసిన ఈ బ్యూటీ ఇప్పుడు శరానంద్ సరసన నటిస్తుందని టాక్.

ఇక ఈ చిత్రాన్ని అనిల్ సుంకర నిర్మించనుండగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆగస్టు నెలలో ప్రారంభం కానుంది. శర్వానంద్-శ్రీను వైట్ల కాంబినేషన్‌లో వస్తున్న ఈ ఎంటర్‌టైనర్‌ను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

తారాతీరం

# వెంకటేశ్, కల్యాణ్ రామ్‌లతో మల్టీస్టారర్

టాలీవుడ్‌లో ఎంతో ఆసక్తి రేపుతున్న భారీ మల్టీస్టారర్ చిత్రానికి గత వారం అధికారికంగా అంకురార్పణ జరిగింది. విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్ రామ్ తొలిసారి కలిసి నటిస్తున్న ఈ చిత్రానికి సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా పూజా కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు, నిర్మాత అల్లు అరవింద్ వంటి సినీ ప్రముఖులు హాజరయ్యారు.



ఈ చిత్రంలో కథానాయికల వివరాలను సైతం చిత్ర బృందం అధికారికంగా వెల్లడించింది. వెంకీ సరసన జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేశ్ నటిస్తుండగా, కల్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి నటించనుంది. దగ్గుబాటి, నందమూరి హీరోల కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్ర నిర్మాణంలో సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంస్థలు భాగస్వామ్యం వహిస్తున్నాయి.

ఈ చిత్రానికి జాతీయ అవార్డు విజేత జి.వి.ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి, చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.

ఆదివారం వార్త

28 జూన్, 2026

## మంచి ముత్యాలు

– పాశ్చాత్య మేధావులు అన్నీ కాగలిగారు. మానవులు మాత్రం కాలేకపోయారు. – దాశరథి రంగాచార్య

– ఏ సమస్యనైనా ఎదుర్కోగలవాడు మేధావి. – జాన్సన్

## కదంబం


'సంఘీ'భావం....5

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల మోత

కవర్ స్టోరీ..6

ప్రకృతి పొలంలో 'డిజిటల్' సాగు

ఈ వారం కవిత్వం.. 11

ఏమి సాధించగలవు?

క్రమశిక్షణే విజయానికి.. 13

అల్లనేరేడు.. పోషకాలు.. 14

కథ..20

పిల్లలు తెచ్చిన మార్పు

ఇంకా...

మొగ్గ

పుస్తక సమీక్ష

వాస్తు

వారఫలం

వగైరా.. వగైరా..


# సమాచారం

## మహిళల కేఫ్



సిక్కింలోని ఈ కేఫ్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇది సముద్ర మట్టానికి సుమారు పదమూడు వేల అడుగుల ఎత్తులో వుండటం ఒక విశేషమైతే, పూర్తిగా మహిళల ఆధ్వర్యంలో నిర్వహించబడుతుండటం మరో ప్రత్యేకత. ఈ కేఫ్ బాబా హర్భజన్ సింగ్ మెమోరియల్ టెంపులకు సమీపంలో ఉంది. ఇందులో పనిచేసేవారంతా స్థానికులే. వంట పని దగ్గర నుండి క్లీనింగ్ వరకు మహిళలే చూసుకోవటం విశేషంగా చెప్పుకోవచ్చు. ఈ కేఫ్ ఆర్మీ సహాయంతో ఏర్పడినట్లు తెలుస్తోంది. ఇది స్థానిక మహిళలకు జీవనోపాధిని కల్పించడంతో పాటు పర్యాటకుల సంఖ్య పెరగడానికి దోహదపడుతోందని చెప్పవచ్చు.

### అతిపురాతన మందిరం



గోబెక్లీ టెపే దేవాలయం ప్రపంచంలోని అతి ప్రాచీన ఆలయాల్లో ఒకటని చెప్పవచ్చు. ఈ దేవాలయం టర్కీలో ఉంది. గోబెక్లీ టెపే అంటే టర్కీ భాషలో కొండ అని అర్థం. దీనిని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com




### శ్రుతి

"సన్నాయి నొక్కే (నాదస్వరం ఊదే) వ్యక్తిని ప్రేమించావు కదా... మరి ఎందుకు అతన్ని వదిలేశావు?"

"ఏం చేయనమ్మా... అతనికి నాకు అస్సలు 'శ్రుతి' కలవలేదు!"

### మామూళ్లు

"కొత్తగా వచ్చిన ఇన్‌స్పెక్టర్ గారు మామూళ్లు వసూలు చేసే విషయంలో చాలా కఠినంగా ఉన్నట్టున్నారురా!"

"ఏం జరిగిందని అలా చెప్తున్నావు?"

"ఆయన కూతురి మనసుని నేను దొంగిలించానని తెలిసి... దానికి కూడా నా దగ్గర 'మామూలు' అడుగుతున్నాడురా!"

### చేయూత

"నాయకుడి ఇంట్లో రైడ్ జరుగుతున్నప్పుడు, కార్యకర్తలంతా వెళ్లి ఆయనతో చేతులు కలిపారట.... ఎందుకలా చేశారు?"

"నాకు ఏదైనా కష్టం వచ్చినప్పుడు మీరంతా నాకు 'చేయూత' ఇవ్వాలి అని నాయకుడు ఎప్పుడూ కార్యకర్తలతో చెప్తుంటారట కదా... అందుకే అలా చేశారు!"

### డబ్బులు తీయకుండా..

"ఒరేయ్, మనీ పర్సులో బొద్దింకను ఎందుకు పెట్టుకున్నావురా?" అడిగాడు వేణు, కిరణ్‌ని.

"అప్పుడే మా ఆవిడ భయపడి, నా పర్సులో నుంచి డబ్బులు తీయకుండా ఉంటుందిరా!" కిరణనసమాధానం.

### మ్యాజిక్

ఇన్‌స్పెక్టర్: "ఒకడు నీ స్కూటర్‌ని తలపై పెట్టుకుని మోసుకెళ్లడం చూశానని చెప్తున్నావు కదా! మరి ఎందుకు వాడిని అడ్డుకుని ఆపలేదు?"

బాధితుడు: "వాడు ఏదో విన్యాసం, మేజిక్ చూపించబోతున్నాడేమోనని నేను లైట్ తీసుకున్నా!"

– జి. సుందరరాజన్

### వినడం లేదు..

"ఏమే కోడలుపిల్లా, ఇల్లు సర్ది చాలా రోజులైనట్టుంది" అంది అత్తగారు.

"నేను చెప్పి చెప్పి విసుగొచ్చింది మీరైనా చెప్పండి మీ



అబ్బాయికి" గడుసుగా సమాధానమిచ్చింది కోడలు.

### ఫ్లాట్ కొనొచ్చు..

"ఏమండీ, మీరు తాగి తగలేసిన డబ్బుతో ఓ ఇల్లు కొనొచ్చు తెలుసా?" అన్నాడు భర్త, భార్యతో.

"అవునా, నీ చీరలు అమ్మితే ఫ్లాట్ కొనొచ్చు, ఆ విషయం నీకు తెలుసా" అన్నాడు భర్త అక్కసుగా.

### కోడలు

"నేను ఆపరేషన్ చేసిన రోగి చనిపోయాడు కదా! మరి 'ఆపరేషన్ సక్సెస్' అని ఫేస్‌బుక్‌లో ఎవరు పోస్ట్ చేశారు?" అడిగాడు డాక్టర్, నర్సుని.

"రోగి కోడలు పోస్ట్ చేసింది సార్" చెప్పింది నర్స్.

### జడ్జి

"మరణం గురించి ముందుగా ఎవరూ చెప్పలేరు" అంది విజయ, పండుతో.

"మా తాతగారు ముందుగా చెప్తారు" అన్నాడు, పండు.

"మీ తాతగారు జ్యోతిష్యం చెప్తారా?"

"కాదు టీచర్, ఆయన జడ్జి" అన్నాడు పండు.

### వండిన తరువాత..

"అమ్మా, సాంబారు చేస్తున్నావా? చారు చేస్తున్నావా?" అడిగాడు, కొడుకు.

"ముందు చెయ్యనివ్వురా, చేసిన తరువాత చెప్తాను.. అది సాంబారా, చారా? అనేది" అంది తల్లి.

### అయితే రెండు..!

"ఈ స్టవ్ తీసుకోండి. గ్యాస్ సగమే ఖర్చవుతుంది" అన్నాడు సేల్స్‌మాన్.

"అలాగా, అయితే రెండు స్టవ్‌లు ఇవ్వండి" అంది అర్చన.

– ఈ.ఎస్.మాధవన్

## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు.. వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా:**
**నవ్వుల్:.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,**
**లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080**
**sunmagvaartha@gmail.com**

'సంఘీ' భావం



# ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల మోత

ప్రతి సంవత్సరం ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజులను పెంచుకుంటూ వెళుతున్నారు. ఫీజులను ఒక క్రమపద్ధతిలో కాకుండా ఎవరికి వారు ఇష్టారాజ్యంగా పెంచుకుంటూ వెళ్లడం వల్ల తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొవలసి వస్తోంది. ఈ విద్యా సంవత్సరంలో ఏకంగా 25-30 శాతం వరకు ఫీజులను పెంచారు. సాధారణ పాఠశాలల్లో ప్రాథమిక విద్యకు 30 నుంచి 40 వేల రూపాయలు వార్షిక ఫీజుగా నిర్దేశించారు. ఇక కార్పొరేట్ విద్యాసంస్థలు ఏకంగా 40-60 వేలు వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, టై, బెల్ట్‌లు, యూనిఫారం వంటివి పాఠశాల కౌంటర్ వద్దే కొనుగోలు చేయాలని డిమాండ్‌నచేస్తున్నారు. పైగా పరీక్షల సమయంలో ప్రశ్న, జవాబు పత్రాలకు కూడా కొంత మొత్తం చెల్లించాలని సూచిస్తున్నారు.ఇక కొత్తగా పాఠశాలలో చేరే విద్యార్థులకు అడ్మిషన్ ఫీజు కింద 2-5 వేలు వసూలు చేస్తున్నారు. వార్షిక ఫీజును మొత్తం చెల్లించిన తరువాత అడ్మిషన్ ఇస్తామని కొన్ని విద్యాసంస్థలు కఠినంగా వ్యవహరిస్తుంటే మరికొన్ని 60 శాతం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వాలు పేర్కొంటున్నప్పటికీ అమలులో మాత్రం ఉండటం లేదు. విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఆయా పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల తల్లిదండ్రులు, ఆర్గనైజర్స్‌తో కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కమిటీ సమావేశం ఏర్పాటు చేసి ఫీజులపై చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఏ ప్రైవేట్ పాఠశాలలోనూ తల్లిదండ్రుల కమిటీలను ఏర్పాటు చేయలేదు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే యాజమాన్యాలే ఇష్టానురాజ్యంగా ఫీజులను నిర్ణయిస్తున్నాయి. విద్య విషయంలో కొంత మెరుగ్గా ఉంటుందని గుర్తింపు పొందిన విద్యాసంస్థలు తల్లిదండ్రులను దోచుకునే ప్రయత్నం చేస్తున్నాయి. పేరెంట్, టీచర్స్ మీటింగ్ పేరుతో ఏర్పాటు చేసే సమావేశాలు ప్రహసనంగా మారాయి. ఈ మీటింగ్‌లలో అధిక భాగం ఫీజుల చెల్లింపు విషయంలోనే టీచర్లు తల్లిదండ్రులను వత్తిడి చేస్తున్నారు.అడ్మిషన్, ట్యూషన్ ఫీజులే కాకుండా ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి నెలా ఏదో ఒక యాక్టివిటీ పేరుతో కార్యక్రమం నిర్వహించి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. తోటి విద్యార్థుల ముందు తమ పిల్లలు చులకన కాకూడదన్న భావనతో విద్యాసంస్థల యాజమాన్యాలు కోరినమేరకు తల్లిదండ్రులు డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 14 వేల వరకు ప్రైవేటు విద్యాసంస్థలు ఉండగా దాదాపుగా 40 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చాలా వరకు సరైన స్థాయిలో విద్యాబోధన చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మారుతున్న సమాజం, ఆధునిక పోకడలను తమ పిల్లలు ఎదుర్కోవాలంటే ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యను అభ్యసించకతప్పదన్న భావన వెలువడుతోంది. దీనితో కుటుంబ పోషణ ఇబ్బందికరంగా ఉన్నా తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ ప్రైవేటు విద్యా సంస్థలకు పంపిస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు కమిటీలను ఏర్పాటు చేయలేదు.విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు కూడా నిర్వహించడం లేదు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో డీఈవోలు, ఎంఈవోలు సమావేశం కూడా నిర్వహిస్తున్న దాఖలాలు లేవు. విద్యాశాఖాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయడం లేదు. ఫీజుల దోపిడీ జరుగుతోందని పలు విద్యాసంస్థల ముందు తల్లిదండ్రులు ధర్నాలు, ఆందోళనలు చేసిన ఘటనలు ఉన్నాయి.

విద్యార్థి సంఘాలు ప్రతి ఏడాది బంద్‌లు, ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించి ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీ విధానాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తుంటారు. అయితే అటు ప్రభుత్వం నుంచి కానీ అధికారుల నుంచి కానీ ఆశించిన స్పందన కనిపించడం లేదు. ప్రభుత్వ పాఠశాలలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా ఆ స్థాయిలో విద్యాబోధన జరగడం లేదు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో బోధన తీరు, సౌకర్యాలు మెరుగుపరిస్తే కొంతవరకు నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది.

ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ, ఉపాధ్యాయ ఖాళీల భర్తీ, సౌకర్యాల కల్పన వంటి అంశాలపై దృష్టి సారిస్తే విద్యావ్యవస్థను మెరుగుపరిచే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

# ప్రకృతి పొలంలో 'డిజిటల్' సాగు

డి.జె. మోహన రావు



"శ్రీకాకుళం జిల్లాలోని మారుమూల గ్రామమైన నవనంబాడులో ఒక చిన్న రైతు ఉదయం పొలానికి బయలుదేరే ముందు తన మొబైల్ ఫోన్‌ను చూస్తాడు. ఆ రోజున వర్షం పడే అవకాశం ఉందని, మరో రెండు రోజుల వరకు నీటిపారుదల అవసరం లేదని, అంతేకాదు పొలంలోని ఒక మూలలో తెగులు ప్రారంభమయ్యే సూచనలు ఉన్నాయని తన మొబైల్ లోని ఒక అప్లికేషన్ అతన్ని నోటిఫికేషన్ ద్వారా హెచ్చరిస్తుంది."

ఇది ఒక ఊహాజనిత దృశ్యంలా అనిపించవచ్చు, కానీ వాస్తవం దిశగా వేగంగా కదులుతున్న వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) ఇప్పటికే అడుగుపెట్టడం ప్రారంభించింది. రాబోయే కాలంలో వాతావరణ అంచనాల నుంచి పంట ఆరోగ్య విశ్లేషణ వరకు ప్రతి దశలో డిజిటల్ సహాయం రైతు నిర్ణయాల్లో భాగం కానుంది. మన భరతమాత ముద్దు బిడ్డ రైతన్న శతాబ్దాలుగా ప్రకృతిని పరిశీలిస్తూ తరతరాల అనుభవాన్ని ఆధారంగా చేసుకుని తన గుండె చప్పుడైన వ్యవసాయాన్ని సాగు చేస్తున్నాడు. అయితే ప్రస్తుత కాలంలో వాతావరణ మార్పులు, భూగర్భ జలాల తగ్గుదల, పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు, మార్కెట్ ధరల్లో హెచ్చుతగ్గులు వంటి ఎన్నో సవాళ్లు వ్యవసాయాన్ని మరింత సంక్లిష్టం చేస్తున్న ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో మన వ్యవసాయానికి కృత్రిమ మేధ కేవలం ఒక తాత్కాలిక సాంకేతిక పరిష్కారంగా మాత్రమే కాకుండా గ్రామీణ ఆర్థికాభివృద్ధికి కొత్త దిశను చూపే ఒక విప్లవాత్మక శక్తిగా మారబోతోంది.

గత దశాబ్ద కాలంలో మన దేశం గణనీయమైన డిజిటల్ మార్పును చూసింది. స్మార్ట్ ఫోన్‌లు పల్లెల్లోని సగటు రైతు చేతుల్లోకి చేరడంతో ఆర్థిక కార్యకలాపాల నుండి ఆన్‌లైన్ సేవల వరకు మొబైల్ యాప్‌లు గ్రామీణ జీవితంలో విడదీయలేని భాగంగా మారాయి. ఈ పరిణామం వ్యవసాయ రంగంపైనా సానుకూల ప్రభావం చూపింది. ఒకప్పుడు రైతు సమాచారం కోసం వ్యవసాయ అధికారులపై ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు అదే రైతు తన మొబైల్ ఫోన్ ద్వారా వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలు, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సలహాలు నేరుగా తెలుసుకునే స్థితికి చేరాడు. ఈ డిజిటల్ విప్లవానికి తదుపరి దశగా నిలుస్తున్న కృత్రిమ మేధ, రైతులకు కేవలం సమాచారాన్ని అందించడమే కాకుండా, ఆ సమాచారాన్ని ఎలా ఉపయోగించుకోవాలో విశ్లేషించి చెప్పగల సామర్థ్యాన్ని కలిగి ఉంది.

## ఉత్పాదక పెంపుతోనే గ్రామీణ వికాసం

దేశ జనాభాలో సగానికి పైగా ప్రజలకు జీవనాధారమైన వ్యవసాయ రంగం, దేశ జీడీపీకి అందిస్తున్న వాటా దాదాపు 15 నుండి 18 శాతం మాత్రమే ఉండటం ఇక్కడి అసమతుల్యతను స్పష్టం చేస్తోంది. వ్యవసాయంపై ఆధారపడుతున్న జనాభా అధికంగా ఉన్నా ఈ రంగం ద్వారా సృష్టించబడుతున్న ఆర్థిక విలువ పరిమితంగానే ఉంది. ఫలితంగా రైతుల ఆదాయాలు ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. ఇక్కడే ఉత్పాదకత అంశం కీలకంగా మారుతుంది. అదే భూమి, అదే నీరు, అదే శ్రమతో ఎక్కువ దిగుబడి సాధించడం, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, మార్కెట్ అనుసంధానాన్ని బలోపేతం చేయడం ద్వారా మాత్రమే వ్యవసాయ ఆదాయాలను పెంచడం సాధ్యమవుతుంది. మన దేశంలో మొబైల్ కనెక్టివిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఉపగ్రహ డేటా, డిజిటల్ భూ రికార్డులు వంటి డిజిటల్ మౌలిక వసతుల విస్తరణ కృత్రిమ మేధ ఆధారిత వ్యవసాయానికి ఎంతో అనుకూల పరిస్థితులను సృష్టిస్తోంది. ఈ వ్యవస్థ అందుబాటులో ఉన్న సమాచారం నుంచి స్వయంగా నేర్చుకుని నమూనాలను గుర్తిస్తుంది, అంచనాలు వేస్తుంది, మెరుగైన నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడుతుంది.

ఉదా: ఒక ప్రాంతానికి సంబంధించిన గత ఇరవై సంవత్సరాల వర్షపాతం వివరాలు, నేల లక్షణాలు, పంటల చరిత్ర, మార్కెట్ ధరల వంటి సమాచారాన్ని విశ్లేషించి రైతుకు ఏ పంట సాగు చేస్తే ఎక్కువ లాభం వస్తుందో సూచించగలదు. వ్యవసాయంలో తీసుకునే ప్రతి

ఎంపిక, విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, తెగుళ్ల నియంత్రణ, మార్కెటింగ్ లాంటివి నేరుగా ఆర్థిక ఫలితాలను ప్రభావితం చేసే నిర్ణయాలను మరింత కచ్చితంగా డేటా ఆధారంగా తీసుకోవడంలో కృత్రిమ మేధ రైతులకు సహకరించి పరోక్షంగా రైతు ఆదాయాన్ని పెంచుతుంది. అప్పుడు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. ఇలా గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోలు శక్తిని పెంచి చిన్న వ్యాపారాల అభివృద్ధికి దోహదపడుతుంది. అందువల్ల ఈ కృత్రిమ మేధను కేవలం సాంకేతిక కోణంలో మాత్రమే కాకుండా గ్రామీణ ఆర్థికాభివృద్ధి దృష్టితో కూడా చూడాల్సిన అవసరం ఉంది.

**వాస్తవాలు చెబుతున్న గణాంకాలు:** మన దేశ అభివృద్ధికి జాతీయ వ్యూహాలను రూపొందిస్తున్న నీతి ఆయోగ్ వ్యవసాయ రంగాన్ని కృత్రిమ మేధ అత్యధిక ప్రభావం చూపగల కీలక రంగాలలో ఒకటిగా గుర్తించింది. వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, స్మార్ట్ మొబిలిటీ వంటి రంగాల్లో దీని వినియోగం దేశ ఆర్థికాభివృద్ధికి కీలకమని స్పష్టం చేసింది. వివిధ పైలట్ ప్రాజెక్టులు కూడా ఆశాజనక ఫలితాలను అందించాయి. డేటా ఆధారిత సాగు విధానాలను అనుసరించిన ప్రాంతాల్లో నీటి వినియోగం తగ్గడంతో పాటు దిగుబడులు పెరిగిన సందర్భాలు కూడా నమోదయ్యాయి. అదే విధంగా తెగుళ్లను ముందుగానే గుర్తించడం ద్వారా పంట నష్టాలను గణనీయంగా తగ్గించగలిగినట్లు అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి.

## సాంప్రదాయ పద్ధతులకు ప్రత్యామ్నాయంగా కృత్రిమ మేధ

వ్యవసాయం పూర్తిగా ప్రకృతిపై ఆధారపడే రంగం కావడంతో రైతు నిర్ణయాల్లో అనిశ్చితి సహజంగా ఉంటుంది. ఈ అనిశ్చితి తగ్గించడం వ్యవసాయ అభివృద్ధిలో కీలక అంశంగా మారింది. తరతరాలుగా రైతులు తమ అనుభవాన్ని ఆధారంగా చేసుకుని నీటి నిర్వహణ, ఎరువుల వినియోగం, పంట సంరక్షణ వంటి నిర్ణయాలు తీసుకుంటూ వచ్చారు. ఈ అనుభవానికి అపారమైన విలువ ఉన్నప్పటికీ, మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈ పరిమితులు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కృత్రిమ మేధ ‘ప్రిసిషన్ అగ్రికల్చర్’ అంటే కచ్చితత్వ వ్యవసాయం ఒక సమర్థవంతమైన పరిష్కారంగా ఎదుగుతోంది.

ఇందులో పొలాన్ని ఒకే మొత్తంగా కాకుండా చిన్న చిన్న భాగాలుగా విభజించి విశ్లేషిస్తారు. ప్రతి భాగంలో నేల స్వభావం, తేమ స్థాయి, పోషక విలువలు, పంట ఆరోగ్యం వంటి అంశాలను విడివిడిగా అధ్యయనం చేస్తారు. ఈ విశ్లేషణ ఆధారంగా ఎక్కడ ఎంత నీరు అవసరం, ఎక్కడ ఎరువులు అవసరం, ఎక్కడ వ్యాధుల ప్రమాదం ఎక్కువగా ఉందో కచ్చితంగా గుర్తించవచ్చు. ఫలితంగా వనరుల వృథా తగ్గి ఉత్పాదకత గణనీయంగా పెరుగుతుంది. గతంలో మట్టి నమూనాలను ప్రయోగశాలలకు పంపించి ఫలితాల కోసం రోజులు వేచి చూడాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు పోర్టబుల్ పరీక్షా




పరికరాలు, డిజిటల్ విశ్లేషణ వ్యవస్థలు చాలా వేగంగా సమాచారాన్ని అందిస్తున్నాయి. ఈ డేటాను కృత్రిమ మేధ విశ్లేషించి రైతుకు ఆచరణాత్మక సూచనలు ఇస్తుంది.

## తెగుళ్ల గుర్తింపు పంట సంరక్షణలో కొత్త దశ

వ్యవసాయంలో అత్యధిక నష్టాలకు కారణమయ్యేవి తెగుళ్లు, వ్యాధులే. చాలాసార్లు రైతు సమస్యను గుర్తించే సమయానికి నష్టం అప్పటికే జరిగిపోయి ఉంటుంది. వ్యాధి ప్రారంభ దశలోనే గుర్తించలేకపోవడం వల్ల కొన్నిసార్లు మొత్తం పంటే ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ సమస్యకు కృత్రిమ మేధ ఇప్పుడు సమర్థవంతమైన పరిష్కారంగా మారుతోంది. ఆధునిక కెమెరాలు, డ్రోన్లు, చిత్ర విశ్లేషణ సాంకేతికతల ద్వారా పంటల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించడం సాధ్యమవుతోంది. ఆకుల రంగులో వచ్చే స్వల్ప మార్పులు, పెరుగుదలలో కనిపించే అసాధారణ లక్షణాలు, వ్యాధి ప్రారంభ సంకేతాలు వంటి సూచనలను ఈ వ్యవస్థలు గుర్తించగలవు. మానవ కంటికి కనిపించేలోపే సమస్యను గుర్తించే సామర్థ్యం వీటి ప్రత్యేకత. ఇంతకు మునుపు రైతులు మొత్తం పొలానికి ఒకేసారి మందులు పిచికారీ చేయాల్సి వచ్చేది. ఇప్పుడు సమస్య ఉన్న ప్రాంతాలను మాత్రమే గుర్తించి, అక్కడే చికిత్స చేయడం సాధ్యమవుతోంది. దీనివల్ల రసాయనాల వినియోగం తగ్గుతుంది. ఖర్చులు తగ్గుతాయి. అలాగే పర్యావరణంపై ప్రభావం కూడా తగ్గుతుంది. వ్యవసాయంలో స్థిరత్వం సాధించాలంటే పంట సంరక్షణ మరింత శాస్త్రీయంగా మారాలి. ఈ మార్పుకు కృత్రిమ మేధ కీలకంగా దోహదపడుతోంది.

వ్యవసాయ విజయాన్ని నిర్ణయించే అత్యంత కీలక అంశాలలో వాతావరణం ప్రధానమైనది. మన దేశంలో ఇప్పటికీ సాగుభూమిలో గణనీయమైన భాగం వర్షపాతంపైనే ఆధారపడి ఉంది. అందువల్ల వర్షం ఆలస్యమైతే, అధికంగా కురిస్తే లేదా అసలు కురవకపోతే రైతుల ఆర్థిక స్థితిపై ప్రత్యక్ష ప్రభావం పడుతుంది. ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదల, రుతుపవనాల అనిశ్చితి వంటి కారణాలు వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న నేటి తరుణంలో కృత్రిమ మేధ ఆధారిత వాతావరణ నమూనాలు రైతులకు మరింత కచ్చితమైన సమాచారాన్ని అందిస్తాయి. ఉపగ్రహ చిత్రాల

వాతావరణ కేంద్రాల డేటా, చారిత్రక వర్షపాతం వివరాలు, ఉష్ణోగ్రతల ధోరణులు వంటి సమాచారాన్ని విశ్లేషించి ప్రాంతాల వారీగా అంచనాలు రూపొందిస్తాయి. దీంతో రైతులు విత్తనాలు ఎప్పుడు వేయాలి, ఎప్పుడు నీరు పెట్టాలి, ఎప్పుడు కోతకు సిద్ధం కావాలి వంటి నిర్ణయాలను ముందుగానే తీసుకునే అవకాశం కలుగుతుంది.

మరోవైపు మార్కెట్ ధరల అనిశ్చితి కూడా భారతీయ రైతులకు పెద్ద సవాలుగా ఉంది. పంట బాగా పండినప్పుడు ధరలు పడిపోవడం, ధరలు పెరిగినప్పుడు ఉత్పత్తి తక్కువగా ఉండటం వంటి పరిస్థితులు తరచూ కనిపిస్తాయి. ఈ సమస్యకు కూడా కృత్రిమ మేధ ఆధారిత అంచనాలు కొంతవరకు పరిష్కారం చూపుతున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న మార్కెట్లలో డిమాండ్, సరఫరా, వినియోగ ధోరణులు, నిల్వలు, ఎగుమతి అవకాశాలు వంటి అంశాలను విశ్లేషించి భవిష్యత్ ధరలపై అంచనాలు వేయడం సాధ్యమవుతుంది. దీని ద్వారా రైతులు పంటల ఎంపికలో మరింత సమాచారం ఆధారిత నిర్ణయాలు తీసుకునే అవకాశం పొందుతారు.

## విదేశాల్లో ఆధునిక వ్యవసాయ పోకడలు

అంతర్జాతీయ స్థాయిలో కూడా వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధ వినియోగం వేగంగా విస్తరిస్తోంది. ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ, ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థలు వ్యవసాయ ఉత్పాదకత పెంపులో డిజిటల్ సాంకేతికతల పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నాయి. భవిష్యత్తు వ్యవసాయం కేవలం భూమి, నీరు, శ్రమపై మాత్రమే కాకుండా సమాచారం, డేటా విశ్లేషణ, సాంకేతికతపై కూడా ఆధారపడనుందని అంతర్జాతీయ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, ఇజ్రాయెల్, నెదర్లాండ్స్ వంటి దేశాలు కృత్రిమ మేధ ఆధారిత వ్యవసాయ పద్ధతుల్లో ముందంజలో ఉన్నాయి.



## మన దేశంలో ఎఐ అన్వయం ఆచరణాత్మక మార్గాలు

మన దేశంలో కూడా ఇండో ఇజ్రాయెల్ అగ్రి ప్రాజెక్ట్స్ ద్వారా ఇలాంటి ఆధునిక పద్ధతులు ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సాగువుతున్నాయి. భారతదేశ వ్యవసాయ రంగంలో జరుగుతున్న డిజిటల్ పరివర్తనలో అగ్రిటెక్ స్టార్టప్‌ల పాత్ర కూడా కీలకం. పంటల ఆరోగ్య విశ్లేషణ, డ్రోన్ సేవలు, మార్కెట్ సమాచారం, భూసార పరీక్షలు, సరఫరా గొలుసు నిర్వహణ, బీమా సేవలు వంటి అనేక రంగాల్లో ఇవి వినూత్న పరిష్కారాలను అందిస్తున్నాయి. ఒకప్పుడు రైతులు మార్కెట్ సమాచారం కోసం మధ్యవర్తులపై ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు డిజిటల్ వేదికల ద్వారా ధరలు, కొనుగోలుదారుల వివరాలు నేరుగా అందుబాటులోకి వచ్చాయి. వ్యవసాయాన్ని కేవలం ఉత్పత్తి ప్రక్రియగా కాకుండా ఒక సమగ్ర విలువ గొలుసుగా మార్చడంలో ఈ స్టార్టప్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

మన దేశానికి అనుకూలమైన ప్రత్యేక నమూనాలు అవసరం. ఈ నేపథ్యంలో 'ఫార్మింగ్ యాజ్ ఎ సర్వీస్' అంటే సేవగా వ్యవసాయం అనే భావనను తీసుకురావాలి. ఇందులో రైతులు పరికరాలను కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు. అవసరమైనప్పుడు సేవల రూపంలో వాటిని వినియోగించుకోవచ్చు. ఉదాహరణకు ఒక గ్రామంలోని స్టార్టప్ డ్రోన్లను కొనుగోలు చేసి, రైతు భరోసా కేంద్రాలు లేదా స్థానిక సహకార సంఘాల ద్వారా రైతులకు అద్దె ప్రాతిపదికన సేవలు అందించవచ్చు. దీనివల్ల రైతులపై భారీ పెట్టుబడి భారం తగ్గుతుంది. అలాగే స్మార్ట్‌ఫోన్ ఆధారిత కృత్రిమ మేధ సేవలు భారతదేశానికి అత్యంత అనుకూలమైన పరిష్కారంగా మారవచ్చు. రైతు తన పొలంలోని సమస్యను ఫొటో తీసి పంపితే కృత్రిమ మేధ వ్యవస్థ దానిని విశ్లేషించి స్థానిక భాషలో సూచనలు అందించగలదు. భారతదేశం వంటి భాషా వైవిధ్యం ఉన్న దేశంలో వాయిస్ ఆధారిత సేవలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. చదవడం, రాయడం రాని రైతులు కూడా మాట్లాడడం ద్వారా సమాచారాన్ని సులభంగా పొందగలుగుతారు.

**డిజిటల్ అగ్రి మిషన్:** భారత ప్రభుత్వం వ్యవసాయ రంగంలో డిజిటల్ పరివర్తనలో భాగంగా ప్రవేశపెట్టిన 'డిజిటల్ అగ్రి మిషన్' ఇక్కడ ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తోంది. దీని ప్రధాన లక్ష్యం వ్యవసాయ రంగానికి సంబంధించిన సమాచారాన్ని సమగ్రంగా డిజిటల్ రూపంలో సేకరించడం.

## కోల్డ్ స్టోరేజ్ నెట్వర్క్ డిజిటల్ మార్కెటింగ్

భారతీయ వ్యవసాయ రంగంలో ఉత్పత్తి పెంపు ఎంత ముఖ్యమో పంట కోత తర్వాత నిర్వహణ కూడా అంతే కీలకం. ప్రతిసంవత్సరం దేశంలో పండ్లు, కూరగాయలు, పూలు, పాల ఉత్పత్తులు సరైన నిల్వ సదుపాయాలు లేకపోవడం వల్ల గణనీయంగా వృథా అవుతున్నాయి. రైతు ఎంతో శ్రమించి పండించిన పంట మార్కెట్‌కు చేరకముందే నష్టపోవడం ఇప్పటికీ ఒక పెద్ద సమస్యగా ఉంది. ఈ నేపథ్యంలో కృత్రిమ మేధ ఆధారిత కోల్డ్ స్టోరేజ్ వ్యవస్థలు కొత్త అవకాశాలను అందిస్తున్నాయి. గిడ్డంగుల్లో అమర్చిన సెన్సార్లు ఉష్ణోగ్రత, తేమ, నిల్వ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తాయి.

ఈ సమాచారాన్ని కృత్రిమ మేధ విశ్లేషించి ఏ ఉత్పత్తి

ఎంత కాలం నాణ్యతను నిలుపుకుంటుందో అంచనా వేస్తుంది. అలాగే ఏ సరుకును ముందుగా మార్కెట్‌కు పంపాలో సూచిస్తుంది. అదే సమయంలో ఈ వ్యవస్థను డిజిటల్ మార్కెటింగ్ వేదికలతో అనుసంధానించడం ద్వారా రైతులు తమ ఉత్పత్తులకు సరైన మార్కెట్లను గుర్తించగలుగుతారు. దేశంలోని ఏ ప్రాంతంలో ఏ పంటకు ఎక్కువ డిమాండ్ ఉందో తెలుసుకుని సరైన సమయంలో విక్రయాలు చేయగలుగుతారు. దీని ద్వారా రైతుల ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది.

## ఆహార భద్రతకు ఒక వ్యూహాత్మక సాధనం

కృత్రిమ మేధ ప్రభావాన్ని కేవలం రైతు ఆదాయాల పెరుగుదల లేదా పంట దిగుబడుల పెంపుతో మాత్రమే అంచనా వేయలేం. ఇది దేశ ఆహార భద్రతను బలోపేతం చేసే కీలక సాధనంగా కూడా ఎదుగుతోంది. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం రాబోయే దశాబ్దాల్లో ప్రపంచ జనాభా మరింత పెరగనుంది. మన దేశం కూడా అధిక జనాభా కలిగిన దేశంగా కొనసాగనుంది. అయితే మరోవైపు సాగుభూమి విస్తీర్ణం పెరిగే అవకాశాలు చాలా పరిమితంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఉన్న భూమిలోనే ఎక్కువ ఉత్పత్తి సాధించడం అత్యవసరంగా మారుతోంది. ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో కృత్రిమ మేధ ఆధారిత వ్యవసాయం కీలక పాత్ర పోషించగలదు. నేల లక్షణాలు, వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత, పంటల అవసరాలు వంటి అంశాలను సమగ్రంగా విశ్లేషించి, వనరుల సమర్థ వినియోగానికి దారి చూపుతుంది. తక్కువ వనరులతో ఎక్కువ ఉత్పత్తి సాధించడం ద్వారా భవిష్యత్తులో దేశ ఆహార అవసరాలను తీర్చడంలో కృత్రిమ మేధ ఒక వ్యూహాత్మక భాగస్వామిగా నిలవగలదు. మన దేశంలో పంట బీమా పథకాల అమలులో ప్రధాన సమస్య నష్టాల అంచనా ప్రక్రియ. పంట నష్టపోయిన తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించాల్సి రావడం వల్ల పరిహారం అందడంలో ఆలస్యం జరుగుతోంది. కృత్రిమ మేధ ఆధారిత ఉపగ్రహ విశ్లేషణ వ్యవస్థలు ఈ పరిస్థితిని గణనీయంగా మార్చగలవు.



## మహిళా రైతులు.. డిజిటల్ వ్యవసాయం

భారతీయ వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర అత్యంత కీలకమైనది. విత్తనాల ఎంపిక నుంచి పంట కోత వరకు అనేక దశల్లో వారు ప్రధాన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో వారికి తగిన అవకాశాలు ఇంకా పూర్తిగా అందడం లేదు. స్థానిక భాషల్లో పనిచేసే కృత్రిమ మేధ ఆధారిత వాయిస్ అసిస్టెంట్లు ఈ అంతరాన్ని తగ్గించగలవు. మహిళా రైతులు కేవలం మాటల ద్వారా వ్యవసాయ సలహాలు, వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలు, ప్రభుత్వ పథకాల వివరాలు తెలుసుకునే అవకాశం పొందగలరు. దీని ద్వారా డిజిటల్ సాధికారత పెరిగి గ్రామీణ మహిళల నిర్ణయాధికారం బలపడుతుంది, వ్యవసాయ రంగంలో వారి పాత్రకు మరింత గుర్తింపు లభించే అవకాశమూ పెరుగుతుంది.

**గ్రామీణ యువతకు కొత్త అవకాశాలు:** కృత్రిమ మేధ గురించి చర్చ జరిగినప్పుడు యంత్రాలు ఉద్యోగాలను భర్తీ చేస్తాయనే అభిప్రాయం తరచూ వినిపిస్తుంది. ఈ మేధ రైతు అనుభవాన్ని భర్తీ చేసి శాస్త్రీయ మద్దతు అందించడం మాత్రమేనని మనం గ్రహించాలి. ఇంకా వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధ కొత్త ఉపాధి అవకాశాలను కూడా సృష్టిస్తోంది. డ్రోన్ ఆపరేటర్లు, డిజిటల్ వ్యవసాయ సలహాదారులు, వ్యవసాయ డేటా విశ్లేషకులు, సెన్సార్ నిర్వహణ నిపుణులు, అగ్రిటెక్ సేవా ప్రదాతలు వంటి కొత్త వృత్తులు గ్రామీణ ప్రాంతాల్లో వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. వ్యవసాయం, సాంకేతికత కలయిక గ్రామీణ యువతకు కొత్త అవకాశాలను అందిస్తోంది, దీనివల్ల గ్రామాల నుంచి పట్టణాలకు జరిగే వలసలను కొంతవరకు తగ్గించే అవకాశం కూడా ఉంది.

**విసురుతున్న సవాళ్లు.. డేటా కలోనియలిజం:** కృత్రిమ మేధ వ్యవసాయ రంగానికి అనేక అవకాశాలను అందిస్తున్నప్పటికీ కొన్ని కీలక సవాళ్లను కూడా ఎదుర్కొంటోంది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు ఈ సాంకేతికత అందుబాటులోకి రావడం ప్రధాన సమస్యగా మారుతోంది. కృత్రిమ మేధ ఆధారిత పరికరాలు, సెన్సార్లు, డ్రోన్లు ప్రారంభ దశలో ఖరీదైనవిగా ఉండే అవకాశం ఉంది. అదే విధంగా సాంకేతిక అవగాహన లోపం, డిజిటల్ అక్షరాస్యత సమస్యలు, ఇంటర్నెట్ సౌకర్యాల పరిమితులు కూడా పెద్ద అడ్డంకులుగా నిలుస్తున్నాయి. అంతేకాకుండా విశ్వసనీయమైన డేటా లేమి మరో ముఖ్యమైన సవాలు. తప్పుడు లేదా అసంపూర్ణ సమాచారం ఆధారంగా పనిచేసే కృత్రిమ మేధ వ్యవస్థలు తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉంటుంది. కృత్రిమ మేధ గురించి చర్చిస్తున్నప్పుడు తరచూ విస్మరించబడే కీలక అంశం డేటా యాజమాన్యం. కృత్రిమ మేధ వ్యవస్థల పని తీరు పూర్తిగా డేటాపైనే ఆధారపడి ఉంటుంది కాబట్టి రైతుల భూమి వివరాలు, పంటల నమూనాలు, ఉత్పత్తి సమాచారం, మార్కెట్ ప్రవర్తన భవిష్యత్తులో అత్యంత విలువైన ఆర్థిక వనరులుగా మారే అవకాశం ఉంది. ఈ సమాచారం కొద్దిమంది సాంకేతిక సంస్థల చేతుల్లో కేంద్రీకృతమైతే



రైతుల ప్రయోజనాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ఈ పరిస్థితిని కొందరు నిపుణులు డేటా కలోనియలిజంగా అభివర్ణిస్తున్నారు. అందువల్ల రైతుల డేటా భద్రత, గోప్యత, యాజమాన్య హక్కులకు సంబంధించిన స్పష్టమైన విధానాలు అవసరం.

ఈ సవాళ్లను అధిగమించడానికి ఒక సమగ్ర వ్యూహం అవసరం. సాంకేతికతను వ్యక్తిగత యాజమాన్య నమూనా కంటే ఉమ్మడి వినియోగ నమూనాలో అభివృద్ధి చేయడం మరింత సమర్థవంతమైన మార్గంగా కనిపిస్తోంది. ప్రతి రైతు డ్రోన్ లేదా అధునాతన పరికరాలను స్వయంగా కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, సహకార సంఘాలు, గ్రామీణ సేవా కేంద్రాలు వంటి వ్యవస్థలు ఈ పరికరాలను సమిష్టిగా కొనుగోలు చేసి, అవసరానుసారం అద్దె ప్రాతిపదికన రైతులకు అందించవచ్చు. అదే సమయంలో గ్రామీణ డిజిటల్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడం అత్యవసరం. నాణ్యమైన ఇంటర్నెట్ సేవలు, నిరంతర విద్యుత్ సరఫరా, స్థానిక భాషల్లో పనిచేసే డిజిటల్ వేదికలు లేకుండా కృత్రిమ మేధ విస్తరణ సాధ్యం కాదు. మరో ముఖ్యమైన అంశం సంస్థల మధ్య సమన్వయం. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, సాంకేతిక సంస్థల మధ్య సమన్వయాన్ని పెంపొందించాలి.

## భారతీయ వ్యవసాయం.. ఒక భవిష్యత్ దృశ్యం

ప్రస్తుత పరిణామాలను పరిశీలిస్తే 2035 నాటికి వ్యవసాయం కేవలం భూమిని దున్ని పంటలు పండించే ప్రక్రియగా కాకుండా డేటా ఆధారిత నిర్ణయాలు, డిజిటల్ విశ్లేషణలు, కృత్రిమ మేధ సలహాలపై ఆధారపడే సమగ్ర వ్యవస్థగా మారవచ్చు. ఒక చిన్న రైతు ఉదయం తన మొబైల్ ఫోన్‌ను తెరిచిన వెంటనే ఆ రోజు వాతావరణ పరిస్థితులు, నేల తేమ, పంట ఆరోగ్య స్థితి, మార్కెట్ ధరలు, నీటి అవసరం, వ్యాధుల ప్రమాదం వంటి వివరాలు అతని స్థానిక భాషలో అందుబాటులోకి రావచ్చు. అతను అడిగే ప్రశ్నలకు కృత్రిమ మేధ ఆధారిత వ్యవసాయ సహాయకుడు వెంటనే సమాధానం ఇవ్వగలడు. పొలాల్లో అమర్చిన సెన్సార్లు, డ్రోన్లు, ఉపగ్రహాలు, మొబైల్ అప్లికేషన్లు, డేటా విశ్లేషణ వ్యవస్థలు పరస్పరం అనుసంధానమై పనిచేసే ఒక సమగ్ర వ్యవస్థ రూపుదిద్దుకోవచ్చు. పంటలకు వ్యాధి సోకే సూచనలు కనిపించిన వెంటనే రైతుకు ముందస్తు హెచ్చరికలు అందే అవకాశం ఉంటుంది. అవసరమైన ప్రాంతాల్లో మాత్రమే ఎరువులు, పురుగుమందులు వినియోగించే విధానాలు సాధారణమవుతాయి. నీటి నిర్వహణలో కూడా గణనీయమైన మార్పులు సంభవించవచ్చు. భూమిలోని తేమ సంకేతాలను నిరంతరం పరిశీలించే వ్యవస్థలు అవసరమైనంత నీటిని మాత్రమే సరఫరా చేయగలవు. దీని ద్వారా నీటి వినియోగ సామర్థ్యం పెరుగుతుంది, భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గుతుంది. వ్యవసాయ మార్కెటింగ్ రంగం కూడా రూపాంతరం చెందవచ్చు.

## నాగలికి తోడైన డిజిటల్ శక్తి

ప్రపంచంలోనే అతిపెద్ద రైతు జనాభా కలిగిన దేశాలలో భారతదేశం ఒకటి. విభిన్న వాతావరణ మండలాలు, పంటల వైవిధ్యం, విస్తారమైన వ్యవసాయ భూభాగం, వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ మౌలిక వసతులు మన దేశానికి ప్రత్యేక బలాలుగా నిలుస్తున్నాయి. ఈ బలాలను సమర్థవంతంగా వినియోగించగలిగితే మన దేశం కేవలం కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగించే దేశంగా మాత్రమే కాకుండా ప్రపంచానికి వ్యవసాయ సాంకేతిక పరిష్కారాలను అందించే కేంద్రంగా కూడా ఎదగగలదు. పరిశోధనా సంస్థలు, ప్రభుత్వ విధానాలు, ప్రైవేట్ పెట్టుబడులు పరస్పరం సమన్వయంతో ముందుకు సాగితే భారతదేశం ప్రపంచ అగ్రిటెక్ రంగంలో నాయకత్వ స్థానాన్ని సంపాదించే అవకాశం ఉంది.

వేల సంవత్సరాలుగా ప్రకృతిని అర్థం చేసుకుంటూ రైతులు సంపాదించుకున్న అనుభవం భారతీయ వ్యవసాయానికి బలమైన పునాది. నేడు ఆ అనుభవానికి డేటా, విశ్లేషణ, కృత్రిమ మేధ వంటి ఆధునిక సాధనాలు తోడవుతున్నాయి. కృత్రిమ మేధ రైతుకు ప్రత్యామ్నాయం కాదు. అది రైతు నిర్ణయాలను మరింత శాస్త్రీయంగా, కచ్చితంగా మార్చే సహాయక శక్తి. భూసారం నుంచి మార్కెట్ ధరల వరకు, వాతావరణ అంచనాల నుంచి పంట బీమా వరకు వ్యవసాయంలోని ప్రతి దశలో ఇది కొత్త అవకాశాలను తెరుస్తోంది. అయితే ఈ సాంకేతిక విప్లవం నిజమైన విజయాన్ని సాధించాలంటే అది చిన్న, సన్నకారు రైతులకు కూడా ప్రయోజనాలను సమానంగా అందించగలగాలి. స్థానిక భాషల్లో, తక్కువ ఖర్చుతో, సులభంగా ఉపయోగించగల కృత్రిమ మేధ పరిష్కారాలు అందుబాటులోకి రావాలి. భారతీయ వ్యవసాయ భవిష్యత్తు కేవలం యంత్రాలలో లేదు, రైతు జ్ఞానాన్ని సాంకేతికతతో అనుసంధానించగల సామర్థ్యంలో ఉంది. నాగలి పట్టిన చేతికి డిజిటల్ శక్తి, అనుభవానికి కృత్రిమ మేధ తోడైతే, రేపటి భారతదేశం ఆహార భద్రతలోనే కాదు, వ్యవసాయ నవకల్పనలో కూడా ప్రపంచానికి మార్గదర్శకంగా నిలువగలదు అనడంలో ఎటువంటి సందేహం లేదు. ✦

ఈ వారం కవిత్వం

## లోటు

మనసుకు నచ్చే
మాటను వినిపించేందుకూ,
పాటను విరచించేందుకూ
స్వేచ్ఛ లేని చోట
ఎన్నున్నా ఏదీ లేనట్లే!,
మది మెచ్చేలా
వినోదంగా విహరించేందుకూ,
విలాసంగా వికసించేందుకూ
వీలు లేని చోట
ఏమేమి ఉన్నా ఏమీ లేనట్లే!
ఉన్నత స్థానమున్నా,
నిండు ఖజానా
ఉన్నా
దమ్మిడీ
దానం
చేయని
గుణ
దారిద్రం
ఉంటే
బల్మి, కల్మి
వ్యర్థమే!
అవసరానికి
ఆదుకునే
ఆత్మీయుడొక్కడూ



లేకుంటే
పరిచయస్థులు వందలున్నా,
బంధువుల మందలున్నా
అందరూ
అలంకారప్రాయులే!
కల్పనలూ, కలలూ
ఎన్నున్నా
ప్రయత్న పటుత్వమూ,
పట్టు వదలని తత్వమూ
లేనిదే
విజయం దూరమే!

**– ఎరుకలపూడి గోపీనాథ రావు**

## ఏమి సాధించగలవు?

మనోక్లేశాలు, కష్టాల
సుడిగుండాలు
మిగుల్చుతాయి నీకు దుఃఖాలు.
జీవితంలో నువు ఓడిపోయావని,
చీకటి బతుకు ఇలా
ఎన్నాళ్ళని?
కంచె మీద పడ్డ
వస్త్రాన్ని,
మెల్లగా తీయాలి అన్నట్టుగా
కష్టాల కొలిమి నుండి ఒర్పుగా
ఒడ్డుకు చేరాలి ఒడుపుగా..
చీకటి లోకంలో ఒంటరిగా,
బిక్కుమంటూ భీరువుగా,
నువు ఎన్నాళ్ళు ఉండగలవు?
ఉండి ఏమి సాధించగలవు?
నా నీడే నాకు తోడనుకునేవు..
చీకటి వెలుగులతో,
దోబూచులాడే
మిథ్య ఆ నీడ..
అంధకారం
అంతటా పరచుకుంటే,
నీడ నీకు తోడు ఉండునా?
చీకటిలో మౌన రోదన చేస్తున్న
నువు భీరువు అనుకోకు..
నీ బలహీనతలు ఏవో తెలుసుకో
నిద్రాణమైన నీ శక్తి సామర్థ్యాలు
మేల్కొలుపుకో
దుఃఖం తర్వాత ఆనందం
కష్టాలు తర్వాత సుఖాలు
చీకటి వెలుగుల్లా
వస్తూ పోతూ వుంటాయి
చీకటిని చీల్చుకుని దినకరుడిలా,
రేపటి సుప్రభాతపు వెలుగులు
నింపుకో!

**– కరణం హనుమంతరావు**

## ఆరాటం



ఎదురు చూసి
ఎదురు చూసి
విసిగి
వేసారిపోయాను
సుమా!
నాకే కోరికా లేదు, నాకేమీ వద్దు.
నిన్ను నిన్నుగా చూడాలని
ఆరాటంగా వుంది సామీ, నీ చెంతకు
చేరాలని, నిన్ను నేదర్శించాలని.
ఈ తపన తీరేదెన్నడో, నిన్ను నేను
చూసేదెన్నదో? క్షణ కాలం
ఉన్నచోట వుండదేమి? నాలోనే
వున్న నిన్ను అడగాలని వుంది.
నా శ్వాసవు నీవైతే, నా ప్రాణమే
నీవైతే.. నా అంతరంగ వేదనను
విన్నవించుకోనీ.
ఎప్పటికీ నా తత్వం నీ ఆజ్ఞకై
ఎదురుచూపే!

**– డా॥ పులివర్తి కృష్ణమూర్తి**

## రెండో అర్థం

నేను
పాత ఇంటి గుమ్మం దగ్గర
నిలబడ్డాను.
ఇల్లు మారలేదు
వెళ్లిపోయింది నేనే.

**– బొల్లిముంత
వెంకట రమణారావు**

## సైన్స్.. సైన్స్

విశ్వంలో పరిణామ ప్రక్రియ
భూగ్రహం
మనిషికి జన్మనిచ్చింది ఆఫ్రికా ఖండం
శిలాజ, జన్యు, ఆధారాలు చెప్పిన
నిజం
ఖండ ఖండాంతరాలు దాటిన
వలసలు
మనిషి అవసరానికి నేర్పిన పని
ముట్లు జీవనాధారానికి అవే
ఆయువు పట్లు
సకల జీవకోటికి సవాల్ విసిరే
మేధస్సు నాగరికత పుష్పించి
వెదజల్లే ఉషస్సు
గాలి మతం, అగ్ని కులం, అవని
ప్రాంతం ప్రకృతిని ప్రేమించడం
సంస్కారం
మానవత్వం సంస్కృతి,
వైజ్ఞానిక స్పృహ ఆచారం
ఎర్రటి రక్తం బతుకునిచ్చే
సంప్రదాయం
పరిశోధన, తర్కం, సత్య శోధనకు
వజ్రాయుధాలు
భిన్నమైన ఆలోచనలే
ఆవిష్కరణలకు విత్తనాలు.
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ రూపాలు
యుద్ధంతో సాధించేది శూన్యం
రెప్పపాటులో గాలిలో కలిసే ప్రాణం
తోటి మనిషిని
ప్రేమించడం దివ్య గుణం.

**– పూసాల సత్యనారాయణ**

సింగిల్ పేజి కథ

# సంధ్య

**సంధ్య** మూడవ కోడలుగా ఆ ఇంట్లో అడుగు పెట్టింది. సులోచన, విజయ మొదటి, రెండో కోడళ్ళు. మామగారు కాలం చేశారు. ఇంటి పెత్తనమంతా కాంతం గారిదే. ఇద్దరి కొడుకులకి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి. సులోచన, విజయ మాత్రం డియస్సి చదువుతున్నారు. చిన్న కొడుకు రామంది ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్ ఉద్యోగం. సంధ్య ఇంటర్ గట్టెక్కింది. ఈ లోపు అబ్బాయి మంచోడు అని పెళ్ళి చేశారు. సంధ్యకు మాత్రం తమ బావల మాదిరి నా భర్తకు ఉద్యోగం లేదనే బాధ ఉండేది.

రామం తన భార్య ఇంటి పనులు చేసుకుంటే చాలు అనుకునేవాడు. ఇద్దరు కోడళ్ళు చదువుతుండడంతో పని భారం సంధ్య, కాంతం మీదనే పడేది. కాలేజీ దగ్గర ఉండడంతో రామం ఇంటికి వచ్చి భోజనం చేసేవాడు. మొదట్లో వంటింట్లో సంధ్యకు చేదోడు వాదోడుగా ఉండేది కాంతం. "మీరు పడుకోండి అత్తయ్యా, నేను చేసుకుంటాను" అని చెప్పేది సంధ్య. దాంతో వంటింట్లోకి రావడం మానేసింది కాంతం. ఉదయమే విజయకు, సులోచనకు, అత్తగారికి తరువాత బావలకు కాఫీ ఇచ్చేది. కనీసం కాఫీ గ్లాసులు సింక్‌లో వేసేవారు కాదు తోడికోడళ్లు. కాంతం మాత్రం ఆయాసపడుతూ కాఫీగ్లాస్ సింక్‌లో వేస్తే "మీకు శ్రమ.. నేను వచ్చి తీసుకుంటానత్తయ్యా" అనేది. "నువ్వు ఒక్కదానివే కష్టపడుతుంటే కనీసం కాఫీ గ్లాస్‌లు అయినా తీసుకోకపోతే ఎలా" అని విజయ, సులోచనలపై మండిపడేది. కాల చక్రం గిర్రున తిరుగుతోంది. ఆ రోజు రిజల్ట్స్ వస్తాయి. విజయ, సులోచన ఇద్దరూ గుడికి వెళ్ళారు. మాటవరసకు కూడా సంధ్యను రమ్మని పిలవలేదు. అది కాంతం మనసును నొప్పించింది. వీళ్లకు ఇంత సర్వీస్ చేస్తోంది. కనీసం మాట వరుసకయినా పిలవ లేదు అనుకుంది. విజయ, సులోచనలకు ఉద్యోగం రాలేదు. దాంతో వాళ్ల భర్తలు "ఇక ఇంటి పనులలో ఒకరికీ ఒకరు సహాయంగా వుండండి" అన్నారు. "వీళ్లకు ఉద్యోగం వస్తుందనే నమ్మకం ఏనాడూ లేదన్నయ్య" అన్నాడు కృష్ణ. "నీ మాదిరి వాళ్ళకు వయసు లేదు" అన్నాడు రామం. "అన్నట్లు సంధ్యను టిటీసి రాయించు" అన్నాడు పెద్దన్నయ్య కుమార్.

"చూస్తా అన్నయ్య" అన్నాడు రామం. "మాకే రాలేదు. ఈవిడకు కానీ రాదు" అనుకున్నారు ఇద్దరు కోడళ్ళు మనసులో. "పెద్ద అన్నయ్య, చిన్న అన్నయ్య మీకో శుభవార్త మా కొలీగ్ కాశీ టూర్ వేశాడు. మీరు వదినెలు, అమ్మ వెళ్ళండి" అన్నాడు. "మరి నువ్వు, సంధ్య" అన్నాడు కుమార్.



"నేను రావడం లేదు. సంధ్యకు అదే రోజు టిటీసి పరీక్ష ఉంది" అన్నాడు.

అమ్మ.. అని రామం నోటిలో నుంచే మాట వచ్చింది. కానీ పెద్ద కొడుకులు, కోడళ్ళు, "అత్తగారిని కాశీకి పిలుచుకుపోతాం" అనలేదు.

కాంతం పరిస్థితి అంతా గమనిస్తోంది. కాశీ ట్రిప్‌కు ఇద్దరు కొడుకులు, కోడళ్ళు మాత్రమే వెళ్ళారు. వాళ్ళు వెళ్లిన నాలుగు రోజులకే సంధ్యకు పరీక్ష. ఇంటిపని అయిపోగానే శ్రద్ధగా చదువుకునేది. అత్త గారు పిలిస్తే వెళ్ళి ఆవిడకు కావాల్సిన మందులు ఇచ్చేది. భోజనం కాగానే పండ్లు ఇచ్చేది.

"నాకు ఉద్యోగం వస్తే మనం వెళదాం అత్తయ్య కాశీకి" అంది సంధ్య. "అలాగే" అంది కాంతం.

అప్పుడే రామం కాలేజీ నుంచి ఇంటికి వస్తూ ఆ మాట విన్నాడు. "ఎక్కడికో పోదాం అంటున్నారు అత్త, కోడళ్ళు" అన్నాడు. "టీచర్ ఉద్యోగం వస్తే మన ముగ్గురం కాశీకండి" అంది సంధ్య అత్త గారి గది నుంచి వస్తూ. "వెళదాం, వెళదాం ముందు ఉద్యోగం రానీ" అన్నాడు. "సంధ్యకు తప్పకుండా వస్తుంది" అంది కాంతం. "రావాలనేగా కోరుకునేది, ముందు భోజనం పెట్టు కాలేజీకి వెళ్ళాలి. రేపే నీ పరీక్ష" అన్నాడు టేబులు ముందు కూర్చుంటూ.

ఆ రోజు పెందలకడనే లేచి భర్త పాదాలకు, అత్త గారి పాదాలకు నమస్కరించి స్నానం చేసి దేవుని దగ్గర దండం పెట్టుకుని "వస్తాను అత్తయ్య, వస్తానండి" అని చెప్పి వెళ్ళింది సంధ్య. సంధ్యకు ఉద్యోగం రావాలని మనసులో అనుకుంది కాంతం. కాశీకి వెళ్ళిన అన్నయ్యలు, వదినెలు ఆ రోజు వచ్చారు. ఆ రోజే టీ.టీ.సి ఫలితాలు.

సంధ్య పరీక్షలో విజయం సాధించింది. అది తెలిసి నివ్వెరపోయారు సులోచన, విజయ. "ఉద్యోగంలో చేరడానికి చాలా టైం ఉంది. అత్తయ్యను పిలుచుకుని మనం కాశీకి వెళదాం" అంది రామంతో. "అలాగే వెళదాం అమ్మ కూడా ఎప్పటినుంచో కాశీకి వెళ్ళాలి అనుకుంటోంది. మనకు పెద్ద దిక్కు కూడా" అన్నాడు రామం.

ఒక కడుపులో పుట్టిన కొడుకులలో ఇంత వ్యత్యాసమా! అనుకుంది కాంతం. కోడళ్ళలో కూడా సంధ్య మాదిరి ఎవ్వరూ పిలువలేదు. అందుకేనేమో వాళ్ళకు ఉద్యోగం రాలేదు అనుకుంది మనసులో. ఒక శుభముహూర్తాన కాశీకి వెళ్ళారు కాంతం, సంధ్య, రామం. "మా కుటుంబం ఎప్పుడూ వేరుపడకుండా చూడు స్వామీ. మా కోడళ్ళకు, కొడుకులకు మంచి బుద్ధి ప్రసాదించు" అని కాశీ విశ్వేశ్వరుణ్ణి వేడుకుంది కాంతం.

– కనుమ ఎల్లారెడ్డి

# క్రమశిక్షణే విజయానికి చిరునామా

మానవ జీవితాన్ని ఉన్నత స్థాయికి చేర్చే విలువలలో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యం ఉంది. వ్యక్తిగత అభివృద్ధి నుంచి జాతీయ పురోగతి వరకు ప్రతి రంగంలోనూ క్రమశిక్షణ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రతిభ, విద్య, సంపద, అధికారం వంటి అనేక అంశాలు మనిషిని ఉన్నత స్థితికి చేర్చగలిగినా, వాటిని సరైన దిశలో నడిపించేది క్రమశిక్షణ మాత్రమే. అందుకే క్రమశిక్షణను విజయానికి పునాది అని పేర్కొంటారు.

ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతోంది. సాంకేతికత విస్తరిస్తోంది. అవకాశాలు పెరుగుతున్నాయి. అదే సమయంలో సవాళ్లు కూడా అధికమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వ్యక్తి తన లక్ష్యాలను చేరుకోవాలంటే సమయపాలన, బాధ్యతాయుతమైన ప్రవర్తన, నియమ నిష్ఠలు తప్పనిసరి. ఇవన్నీ క్రమశిక్షణలో భాగాలే. క్రమశిక్షణ అనేది కేవలం నియమాలను పాటించడం మాత్రమే కాదు; మన ఆలోచనలు, మాటలు, పనులను సరైన మార్గంలో నడిపించగల సామర్థ్యం.



ఒక విద్యార్థి జీవితాన్ని పరిశీలిస్తే క్రమశిక్షణ యొక్క ప్రాముఖ్యత స్పష్టమవుతుంది. ప్రతిరోజూ నిర్ణీత సమయానికి చదవడం, ఉపాధ్యాయుల సూచనలను పాటించడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం వంటి అలవాట్లు విద్యార్థిని విజయపథంలో నడిపిస్తాయి. తెలివితేటలు ఉన్నా క్రమశిక్షణ లేకపోతే ఆశించిన ఫలితాలు సాధించడం కష్టం. ఇదే విషయం ఉద్యోగులు, వ్యాపారులు, క్రీడాకారులు, రాజకీయ నాయకులు అందరికీ వర్తిస్తుంది.

సమాజ నిర్మాణంలో కూడా క్రమశిక్షణకు అపారమైన ప్రాధాన్యం ఉంది. రహదారి నియమాలను పాటించడం, ప్రజా ఆస్తులను సంరక్షించడం, చట్టాలను గౌరవించడం వంటి అంశాలు సామాజిక క్రమశిక్షణకు ఉదాహరణలు. ఒక సమాజంలో ప్రతి వ్యక్తి తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తే అక్కడ శాంతి, భద్రత, అభివృద్ధి సహజంగానే నెలకొంటాయి. అయితే క్రమశిక్షణ లోపించినప్పుడు ప్రమాదాలు, అవినీతి, అసమానతలు, సామాజిక అశాంతి పెరుగుతాయి. మన దేశ అభివృద్ధి ప్రయాణంలో కూడా క్రమశిక్షణ ఒక ప్రధాన అంశంగా నిలుస్తోంది. అభివృద్ధి చెందిన దేశాలను పరిశీలిస్తే అక్కడి ప్రజలలో సమయపాలన, బాధ్యత, నియమాల పట్ల గౌరవం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రభుత్వ యంత్రాంగం నుంచి సాధారణ పౌరుల వరకు ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాలను నిబద్ధతతో నిర్వర్తించడం వల్లే ఆ దేశాలు ప్రగతి సాధించాయి. మన దేశంలో కూడా ఈ విలువలు మరింత బలపడితే అభివృద్ధి వేగవంతమవుతుంది.

నేటి యువత ముందున్న అతిపెద్ద సవాలు దృష్టి మరల్చే అంశాల పెరుగుదల. సామాజిక మాధ్యమాలు, వినోద వేదికలు, డిజిటల్ ప్రపంచం అనేక అవకాశాలను అందిస్తున్నప్పటికీ, సమయాన్ని వృథా చేసే ప్రమాదం కూడా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో స్వీయ నియంత్రణ అత్యంత అవసరం. లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం క్రమబద్ధమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలి. క్రమశిక్షణతో కూడిన యువతే దేశ భవిష్యత్తును నిర్మించగలదు.

కుటుంబం క్రమశిక్షణకు మొదటి పాఠశాల. పిల్లలు తల్లిదండ్రులను చూసి నేర్చుకుంటారు. పెద్దలు తమ ప్రవర్తన ద్వారా మంచి విలువలను అందించాలి. అదే విధంగా విద్యాసంస్థలు కూడా కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో బాధ్యత, సమయపాలన, సామాజిక స్పృహ వంటి గుణాలను పెంపొందించాలి.

విలువలతో కూడిన విద్య ద్వారా మాత్రమే క్రమశిక్షణ గల పౌరులను తీర్చిదిద్దడం సాధ్యమవుతుంది. క్రమశిక్షణ అంటే స్వేచ్ఛకు వ్యతిరేకం కాదని గుర్తించాలి. వాస్తవానికి నిజమైన స్వేచ్ఛకు క్రమశిక్షణే పునాది. నియంత్రణలేని స్వేచ్ఛ గందరగోళానికి దారితీస్తే, క్రమశిక్షణతో కూడిన స్వేచ్ఛ వ్యక్తి సామర్థ్యాలను వికసింపజేస్తుంది. అందువల్ల క్రమశిక్షణను బలవంతంగా విధించే నియమంగా కాకుండా, వ్యక్తిగత అభివృద్ధికి మార్గదర్శకంగా చూడాలి. క్రమశిక్షణ అనేది వ్యక్తిని విజయవంతుడిగా, సమాజాన్ని సుసంఘటితంగా, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే శక్తి. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త నైపుణ్యాలను అలవరచుకోవడం ఎంత అవసరమో, క్రమశిక్షణను జీవితంలో భాగం చేసుకోవడం అంతకంటే ముఖ్యమైనది. ప్రతి పౌరుడు క్రమశిక్షణను తన జీవన విధానంగా స్వీకరిస్తే వ్యక్తిగత విజయాలు మాత్రమే కాకుండా సామూహిక శ్రేయస్సు కూడా సాధ్యమవుతుంది.

క్రమశిక్షణతో కూడిన సమాజమే సుస్థిర అభివృద్ధికి, శాంతి సమృద్ధులకు నిజమైన మార్గం.

– తిప్పర్తి శ్రీనివాస్

# అల్లనేరేడు.. పోషకాలు మెండు

**నేరేడు పండు భారతదేశపు సాంప్రదాయక, కాలానుగుణ పండ్లలో విశిష్టమైనది. వర్షాకాలం ఆరంభంలో లభించే ఈ పండు కేవలం నోటికి రుచిని అందించడమే కాకుండా, తల నుండి నఖశిఖ పర్యంతం శరీరానికి అవసరమైన ఎన్నో అద్భుతమైన ఔషధ గుణాలను కలిగి ఉంది.**

ఆయుర్వేద వైద్యంలో నేరేడు చెట్టు బెరడు, ఆకులు, పండ్లు గింజలను కూడా వివిధ రకాల వ్యాధుల నివారణకు శతాబ్దాలుగా ఉపయోగిస్తున్నారు. మిల మిల మెరిసే అల్లనేరేడు పండు, దీనిని జామూన్ అని కూడా పిలుస్తారు, ఇది భారతదేశం. ఆగ్నేయాసియాకు చెందిన ఒక ఉష్ణమండల పండు. చిన్న, గుండ్రని నలుపు లేదా ఊదా రంగులో ఉంటుంది. నోట్లో

వేసుకోగానే ఇట్టే కరిగిపోయే ఈ పండు పోషకాల గని అనారోగ్యాల నివారణి. శక్తి నందించి ఆరోగ్యానికి మేలు చేయడమే కాదు. కొన్ని రకాల రోగాలనూ నియంత్రించే శక్తి నేరేడు సొంతం. ఒక్క పండే కాదు, ఆకులు, బెరడు కూడా శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. ఆక్సాలిక్ టాన్మిక్ ఆమ్లం, విటమిన్లు, క్రోమియం వంటివి నేరేడులో పుష్కలం. నేరేడు చెట్లు వంద ఏళ్ళకు పైగా జీవించగలవు. వేసవిలోన ప్రత్యేకంగా లభించే అనేక పండ్లు, కూరగాయలు ఉన్నాయి. ఈ సమయంలో ఇవి తప్పనిసరిగా తీసుకుంటే రుచిని ఆస్వాదించడంతో పాటు ఆరోగ్యాన్ని పొందవచ్చు. ఎండాకాలంలో పోషకాలు అధికంగా ఉండే పండ్లలో నేరేడు లేదా జామూన్ ఒకటి. తీపి, పులుపు, వగరు కలగలసిన రుచిని కలిగి ఉండే ఈ పండులో ఆస్ట్రింజెంట్, యాంటీ డ్యూరిటిక్ వంటి లక్షణాలు ఉంటాయి. తక్కువ కేలరీలు, ఎక్కువ శక్తిని అందించే నేరేడు పండు లేదా విత్తనాల పొడిని క్రమం తప్పకుండా అధిక బరువు



మొదలుకుని మధుమేహం వరకూ ఎన్నో సమస్యలు తొలగిపోతాయి. సిజిజియం క్యుమిన్ దీని శాస్త్రీయ నామము. ఇది సీజనల్‌గా వచ్చే ఎన్నో ఔషధ గుణాలు ఉండే పండు. నేరేడులో ఉండే 'జాంబోలిన్', 'జాంబోసిన్' అనే గ్లూకోసైడ్లు, మనం తినే ఆహారంలోని పిండి పదార్థాలు (స్టార్చ్) త్వరగా గ్లూకోజ్‌గా మారకుండా నిరోధిస్తాయి. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగవు. నేరేడు గింజలను ఎండబెట్టి చేసిన పొడిని రోజూ ఉదయం పరగడుపున గోరువెచ్చని నీటితో తీసుకుంటే ఇన్సులిన్ ఉత్పత్తి పెరుగుతుంది.

నేరేడు పండు, తీపి, పులుపు రుచుల సమ్మేళనమే, నేరేడు ఆకులు, బెరడును కూడా ఔషధాల తయారీలో

వాడతారు. ఈ పండులోని యాంటీ ఆక్సిడెంట్స్ కేన్సర్, కాలేయ సంబంధ వ్యాధుల్ని నివారిస్తాయి. నేరేడులోని పోషకాలు శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. చర్మం, జుట్టు ఆరోగ్యానికి మంచిది. నేరేడు పండులో విటమిన్ ఎ,సి, యాంటీ ఆక్సిడెంట్లు చర్మం, జుట్టు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఎండిన నేరేడు పండ్ల పొడి చర్మం మీది ఎర్రని మచ్చలను పోగొట్టి, కాంతినిస్తుంది. విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. నేరేడు పండులో ఫైబర్ అధికంగా ఉంటుంది, విటమిన్ ఇ కూడా రక్తంలో గ్లూకోజ్ స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది.

రక్తంలో చక్కెర స్థాయి ఎక్కువ కాకుండా చూస్తుంది. మధుమేహాన్ని నియంత్రిస్తుంది. నేరేడు పండులో యాంటీఆక్సిడెంట్లు, కరిగే ఫైబర్ ఉంటాయి, ఇవి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. గుండె కండరాలు గట్టిపడకుండా చూసి, హృదయ సంబంధ వ్యాధుల్ని నివారిస్తుంది.

కొన్ని అధ్యయనాల ప్రకారం, నేరేడు పండు కాలేయం పనితీరును మెరుగుపరుస్తుంది. నేరేడు పండు తింటే జీర్ణవ్యవస్థ చక్కగా పనిచేస్తుంది. నేరేడు పండు రసం ఫైటో కెమికల్‌గా పనిచేస్తుంది. ఈ రసం తాగితే కాలేయం సంబంధ వ్యాధులు తగ్గిపోతాయి. కాలేయం పనితీరుని మెరుగు పరచడంలో వీటిల్లో ఉండే యాంటాక్సిడెంట్లు

కీలకంగా పని చేస్తాయి. అలానే ఇవి రక్తక్యాన్సర్ కారకలను నిరోధిస్తాయని కూడా ఆవి తెలుపుతున్నాయి. కాల్షియం, ఫాస్పరస్ ఎముకలకు బలాన్ని ఇస్తాయి. దీనిలోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు నోటిని శుభ్రపరచడమే కాదు దంతాలు, చిగుళ్లను దృఢంగా చేస్తాయి కూడా. వేడి ప్రభావానికి కడుపులో గ్యాస్ చేరి ఏంతిన్నా అరగనట్లుగా అనిపిస్తుంది. ఒక్కోసారి వాంతి చేసుకోవాలన్న భావాన కూడా కలుగుతుంది ఇలాంటప్పుడు నాలుగైదు నేరేడు పళ్లను తింటే ఉపశమనం కలుగుతుంది. ఎసిడిటీ ఇబ్బందినీ తగ్గిస్తుంది. జీర్ణశక్తిని పెంపొందించడమే కాకుండా ఒంట్లోని వేడిని తగ్గిస్తుంది. నేరేడు రసాన్ని, నిమ్మ రసంతో కలిపి తీసుకొంటే మైగ్రేన్కు పరిష్కారం లభిస్తుంది. అతిమూత్ర వ్యాధితో ఇబ్బందిపడేవాళ్లు నేరేడు తీసుకోవడం ద్వారా ఉపశమనం పొందవచ్చు. దీంట్లోని పొటాషియం తరచూ మూత్ర విసర్జన కాకుండా చేస్తుంది.

నోరు తడారిపోయి తరచూ దాహం వేయకుండా చేస్తుంది. వయసు పెరగడం వల్ల వచ్చే ఇబ్బందులను ఆలస్యం చేస్తుంది.

మెదడు చురుగ్గా పనిచేసేలా చేస్తుంది. ఆస్తమా, బ్రాంకైటిస్‌ంటి శ్వాస సంబం దిత ఇబ్బందులతో బాధపడేవాళ్లు దీన్ని తీసుకోవడం వల్ల ఉపశనం లభిస్తుంది. ఇది మాత్రమే కాదు నేరేడు పండుకు రక్తాన్ని శుద్ధి చేసే శక్తి కూడా ఉంది.

ఇందులో క్యాలరీలు చాలా తక్కువగా ఉండటం, పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక ఉత్తమమైన ఫుడ్. ఇది తిన్న తర్వాత ఎక్కువ సమయం ఆకలి వేయకుండా చూస్తుంది.



### నేరేడు పండ్లు తినేటప్పుడు నియమాలు

నేరేడు పండుతో పాటు పసుపును కలిపి తీసుకోకూడదు. పసుపులో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు మంటను తగ్గించడంలో సహాయపడతాయి. ఈ పండు తిన్న వెంటనే పసుపు తీసుకోకూడదు. ఈ రెండూ కలవడం వల్ల కడుపునొప్పి వస్తుంది. ఈ రెండింటి మధ్య కనీసం ముప్పై నిమిషాల అంతరం ఉండాలి. నేరేడు పండు, పాలు కలిపి తీసుకోకూడదు.

నేరేడుతో పాలు తాగడం వల్ల శరీరానికి హాని కలుగుతుంది. వాటిని ఒకేసారి తింటే జీర్ణక్రియ వ్యవస్థ దెబ్బతింటుంది. ఫలితంగా గ్యాస్ పెరుగుతుంది. పచ్చళ్లు, నేరేడు పండు కలిపి తీసుకోకూడదు. ఈ రెండింటి కలయిక విష ప్రభావానికి గురిచేస్తుంది. విరేచనాలు, అజీర్ణం, గ్యాస్, కడుపు నొప్పి వస్తాయి. ఈ రెండింటి మధ్య కనీసం 30 నిమిషాల అంతరం ఉండాలి.

పరగడుపున నేరేడు పండ్లు తింటే అందులోని యాసిడ్ల వల్ల కడుపులో మంట, అసిడిటీ వచ్చే అవకాశం ఉంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా తగ్గిస్తుంది కాబట్టి, ఏదైనా సర్జరీ జరగడానికి రెండు వారాల ముందు నుండి దీనికి దూరంగా ఉండటం మంచిది.

ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుతమైన పండ్లలో నేరేడు ఒకటి. మార్కెట్‌లో దొరికే ఖరీదైన విదేశీ పండ్ల కంటే, మన స్థానిక వాతావరణంలో పండే నేరేడు పండు ఎంతో మేలైనది.

మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇదొక సంజీవని లాంటిది. సీజన్ దొరికినప్పుడు ఈ పండ్లను మిస్ కాకుండా తింటూ, పైన పేర్కొన్న జాగ్రత్తలు పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చు.

– ఆనంద 'మైత్రేయ'మ్

---

మాస్కో మెట్రో స్టేషన్ అంతా కళాత్మకంగా చూపరుల్ని ఆకర్షించి కట్టి పడేస్తుంది. పైగా భూగర్భ రైలుమార్గం కావటంతో పాటు ఓ నగరంలో విహరిస్తున్న అనుభూతి పొందుతాం. కళ చరిత్ర, అంతా కట్టెదుట సాక్షాత్కరింపజేస్తుంది.



1935లోమాస్కో మెట్రో సోవియట్ శక్తి ఉన్నతి ఆదర్శాల కలబోతగా ఉండాలని స్టాలిన్ వాస్తు కళాకారులను హెచ్చరించాడు.

"రాజమహల్ వీధుల్లో మన రైలు బోగీలు నడుస్తున్న అనుభూతి కలగాలి" అన్న మాటలకు నిదర్శనంగా నిల్చింది. ఎస్కలేటర్‌లో కిందకి దిగినప్పుడు మెరిసే చలువరాతి కారిడార్లు శ్రామిక సైనిక కళాకారుల జీవితాలు కనిపిస్తాయి. స్టెయిన్‌లెస్ స్టీల్‌తో మెరిసే స్తంభాలను 76 కాంస్య ప్రతిమలు రంగుటద్దాల కిటికీలు మయసభలా తోస్తాయి.

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో బాంబు షెల్టర్‌గా ఉపయోగ పడింది. యుద్ధం తర్వాత కూడా రష్యన్ ఇంజనీర్ల ప్రతిభకి తార్కాణంగా నేడు అల్ట్రామోడర్న్ రైళ్ల పరుగులు తీస్తూ ఆ అద్భుత సౌందర్యం కళాఖండాల్ని ప్రయాణీకులను పరవశింపజేస్తున్నాయి. ఏ మ్యూజియంకి వెళ్లనవసరం లేకుండా ఆ మెట్రో స్టేషన్‌లో విహరిస్తే మయసభతో పనిలేదు సుమా!

– ఆర్.ఎ

# సమయస్ఫూర్తి

ఓ గ్రామంలో రామయ్య అనే నిరుపేద రైతు నివసించేవాడు. తనకున్న కొద్దిపాటి పొలంలోనే పంటలు పండించేవాడు. ఒకసారి వరుసగా రెండు యేళ్లు కరువు రావడంతో రామయ్య సాగు కోసం చేసిన ఖర్చులు భారమయ్యాయి. ఆ పరిస్థితుల్లో తన కుటుంబాన్ని గట్టెక్కించడానికి అదే గ్రామంలో ఉండే రంగయ్య అనే వడ్డీ వ్యాపారి దగ్గర కొంత అప్పు తీసుకున్నాడు. రంగయ్య ఊరిలో పేరున్న ధనవంతుడైనా, అతని మనసు మాత్రం చాలా కపటమైనది. రామయ్య అప్పు తీర్చలేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని, ఎలాగైనా ఆ చిన్న పొలాన్ని తన పరం చేసుకోవాలని రంగయ్య ఒక పన్నాగం పన్నాడు.



ఒకరోజు సాయంత్రం రంగయ్య రామయ్యను ఊరి రచ్చబండ దగ్గరకు పిలిచాడు. అక్కడ ఊరి జనం కూడా ఉన్నారు. రంగయ్య గొంతు "రామయ్యా, నీ అప్పు రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇప్పుడు నీకు ఒక అవకాశం ఇస్తున్నాను. మన పూర్వీకులు చెప్పినట్లు ఇది విధి నిర్ణయం. ఇక్కడ ఒక సంచిలో ఒక నల్లటి రాయి, ఒక తెల్లటి రాయి వేస్తాను. నువ్వు చూడకుండా ఒక రాయిని తీయాలి. ఒకవేళ నువ్వు నల్లటి రాయి తీస్తే నీ పొలం నా వశమవుతుంది, నీ అప్పు పూర్తిగా మాఫీ చేస్తాను. అదే నువ్వు తెల్లటి రాయి తీస్తే నీ పొలం నీ దగ్గరే ఉంటుంది, నీ అప్పు కొట్టేస్తాను" అన్నాడు.

రామయ్య సరే అన్నాడు. రంగయ్య వంగి రెండు రాళ్లను తీసి సంచిలో వేయడం రామయ్య నిశితంగా గమనించాడు. రంగయ్య తెలివిగా రెండు నల్లటి రాళ్లనే సంచిలో వేశాడని రామయ్యకు అర్థమైపోయింది. ఇప్పుడు ఏ రాయి తీసినా రామయ్య తన జీవనాధారమైన పొలాన్ని కోల్పోతాడు. రంగయ్య మోసాన్ని అందరి ముందు నిలదీస్తే, అతను అప్పు వెంటనే కట్టమని వేధిస్తాడని రామయ్యకు తెలుసు. ఆ నిమిషంలో రామయ్య కంగారు పడకుండా తన సమయస్ఫూర్తిని ప్రదర్శించాడు.

రామయ్య సంచిలో నుండి ఒక రాయిని బయటకు తీశాడు. అది ఎవరూ చూడకముందే తడబడుతున్నట్లు నటిస్తూ తన చేతిలో నుండి రాయి కింద పడేలా చేశాడు. ఆ రాయి నేలపై ఉన్న వేలాది రాళ్లలో కలిసిపోయింది. రామయ్య "అయ్యో! రాయి కింద పడిపోయింది. ఇప్పుడు నేను ఏ రాయి తీశానో ఎలా తెలుస్తుంది?" అన్నాడు. వెంటనే తేరుకుని, "సంచిలో ఇంకా ఒక రాయి ఉంది కదా! అది ఏ రంగులో ఉందో చూస్తే, నేను తీసిన రాయి ఏ రంగుదో సులభంగా తెలిసిపోతుంది" అన్నాడు.

రంగయ్య బిత్తరపోయాడు. సంచిలో రెండో నల్లటి రాయి ఉంది. అంటే రామయ్య తీసిన మొదటి రాయి తెల్లటిదే అని ఊరి జనం నమ్మారు. రంగయ్య తన మోసం బయట పడకూడదని, తను రెండు నల్ల రాళ్లే వేశానని ఒప్పుకోలేక మౌనంగా ఉండిపోయాడు. అలా రామయ్య సమయస్ఫూర్తితో తన పొలాన్ని కాపాడుకున్నాడు. "నిజాయితీగా బతికే వారికి దేవుడు ఏదో ఒక రూపంలో దారి చూపిస్తాడు. ఆపద సమయంలో గుండె ధైర్యం వీడకుండా ఆలోచించడమే మనల్ని రక్షిస్తుంది" అని రామయ్య అక్కడున్న వారందరితో అన్నాడు.

– సి.హెచ్.ప్రతాప్



# తెలుగు బాలల వెలుగు

వార్త ఆదివారం

## బాలగేయం



### వాన

చల్లని గాలి వీచేను
తెల్లగ మెరుపులు మెరిసేను
బల్లున ఉరుములు ఉరిమేను
మెల్లగ మేఘం కరిగేను
చిటపట చినుకులు కురిసేను
స్వచ్ఛ గ్రామాలు తడిసేను
పచ్చని పొలాలు పండేను
రైతుల ముఖాలు మెరిసేను
పిల్లలు బయటకు వచ్చేరు
జోరు వానలో తడిసేరు
కాగితపు పడవలు వదిలేరు
పిల్లలు గంతులు వేసేరు
చెట్లు ఊగుతు స్వాగతించేను
వాగులు చెరువులు నిండేను
జంతుజాలం ఆనందించేను
ప్రకృతి మొత్తం పులకించేను.

– ఆవుల చక్రపాణి యాదవ్

## చిన్నారుల ప్రశ్నలకు

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**కె.ప్రసాద్, నాందేడ్**

**ప్రశ్న: భాషకు-లిపికి గల సంబంధం ఏమిటి? వివరించగలరు.**

**జవాబు:** మాట్లాడే దానిని భాష అంటున్నాం. భాష ప్రధానంగా మనం నోటితో చేసే ధ్వనుల రూపంలో ఉంటుంది. మనం కేవలం మాట్లాడటమే కాకుండా రాయగలం కూడా. మనం ఏ భాషలో మాట్లాడగలిగితే ఆ భాషలో రాయగలం. దానినే లిపి అంటారు. నోటితో చేసే, ధ్వనుల రూపంలో ఉన్న భాషకు చేతితో గీసే, లేదా చేతితో రాసే గుర్తులు కల్పించడం జరిగింది. కొన్ని దేశాలలో వారు తాము ఉద్దేశించిన భావాలకు, దృశ్యాలకు దగ్గరగా వున్న చిత్రాల గుర్తులు కల్పించారు. (బొమ్మలతోనే ఆ భాషలకు లిపి ఉంటుంది). భాషకు కల్పించిన ఈ తరహా గుర్తులనే లిపి అంటారు. ఈనాటికీ ప్రపంచంలో లిపి లేని భాషలే అనేకం ఉన్నాయి. మన దేశంలో కూడా లిపి లేని భాషా సమాజాలు కొన్ని ఉన్నాయి. ఉదాహరణకు నీలగిరి కొండల్లో నివసించే తొద అనే భాషా సమాజం వారికి లిపి లేదు. గిరిజన తెగలైన గొండు, ఎరుక, కోయ మొదలైన వారి భాషలకు లిపి లేదు. వీరు తమ భావాలను తెలుగులోనే రాసుకునేవారు గతంలో. ఇతర రాష్ట్రాల గిరిజనులు వారి నివాస రాష్ట్రాల భాషను లిపిగా వాడుకుంటారు. ఉదాహరణకు కొంకణి భాషను మాట్లాడేవారు (గోవా, కార్వార్, మంగళూరు) తమ ప్రాంతాలు, రాష్ట్రాలను అనుసరించి దేవనాగరి, కన్నడ, రోమన్ లిపిలో రాస్తారు.

**ఎస్.ఆత్మిక, కనిగిరి**

**ప్రశ్న: పచ్చలు అని వేటిని అంటారు?**

**జవాబు:** పచ్చలు(ఎమరాల్డ్స్) బెరిల్ అనే ఖనిజ రకానికి చెందిన ఆకుపచ్చని రత్నాలు. వీటిని పచ్చలు లేదా మరకతాలు అని అంటారు.





కథ

# పిల్లలు తెచ్చిన మార్పు

నారంశెట్టి ఉమామహేశ్వరరావు

ఆనందపురం ఒకప్పుడు చిన్న గ్రామం. పాతికేళ్లలో చాలా మార్పులు రావడంతో బాటు ఊరి జనాభా అనూహ్యంగా పెరగడంతో అదొక పట్టణం అయింది. ఒకప్పుడు అక్కడి వారు ఆనందంగా ఉండేవారు.

చుట్టూ పచ్చని పొలాలు, మామిడి తోటలు, స్వచ్ఛమైన లేని గాలి వీస్తుండేది. పక్షుల కిలకిలారావాలతో, సూర్యుని మునులతో కిరణాలతో ఊరు నిద్ర నుంచి మేల్కొనేది.

కానీ అదంతా గతం. ఇప్పుడా ఊరుకి పెద్ద శాపమై కూర్చుంది ఊరు చివర ఉన్న చెత్త నిలవ ప్రదేశం.

ఒకప్పుడది ఊరి చివరే ఉండేది. జనాభా పెరగడంతో పాటు ఇళ్లు పెరగడంతో చెత్త నిల్వ ప్రదేశం ఇప్పుడి ఊరి మధ్యలో ఉన్నట్టయింది.

ప్లాస్టిక్ కవర్లు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, కుళ్లిన పదార్థాలన్నీ అందులో కుప్పగా పోయడంతో ఒకప్పటి చెత్తకుప్ప ఇప్పుడు చెత్త కొండ అయింది. దానినుండి వచ్చే విషపూరితమైన మిథేన్ గ్యాస్ వల్ల అక్కడ తరచూ మంటలు రేగేవి. ఘాటైన దుర్వాసన వ్యాపించేది.

అక్కడికి దగ్గరలో 'స్నేహ నిలయం' అనాథాశ్రమం ఎప్పటి నుండో ఉంది. అక్కడి పిల్లలు తెలివైనవారు. చురుగ్గా ఆటపాటల్లో పాల్గొనేవారు. ఇప్పుడు వాళ్లకు కష్టాలు మొదలయ్యాయి. చెత్త కొండ నుంచి వచ్చే నల్లటి విషపూరిత పొగ స్నేహ నిలయం పిల్లల చిరునవ్వులను మింగేయడం మొదలుపెట్టింది.

ఒక శీతాకాలం రాత్రి పిల్లలంతా గాఢ నిద్రలో ఉండగా వ్యర్థాల నుండి మంటలు పుట్టాయి. దట్టమైన పొగ చుట్టూ వ్యాపించింది. అది స్నేహనిలయాన్ని చుట్టేసింది.

"అమ్మా! ఊపిరి ఆడటం లేదు!" అంటూ ఆశ్రమంలో ఒక్కసారిగా పిల్లల అరుపులు, కేకలు వినిపించాయి.

కళ్లు తెరిచి చూసేసరికి ఆశ్రమం అంతా తెల్లటి దట్టమైన పొగ ముంచెత్తింది. అక్కడున్న అందరికీ కళ్లు మండుతున్నాయి. గొంతులో మంట పుడుతోంది. ఒక్కో చిన్నారి భయంతో వణుకుతూ, "నాకు ఊపిరి అందడం లేదు, మనం చనిపోతామా?" అని ఏడవడం మొదలుపెట్టారు.

ఆశ్రమ నిర్వాహకురాలు సరస్వతి అమ్మ క్షణాల్లో అప్రమత్తమైంది. పిల్లలందరినీ ఒక గదిలోకి తీసుకెళ్లి తడిగుడ్డలు ముక్కులకు కట్టింది. "భయపడకండి. ఈ తడి గుడ్డల ద్వారా శ్వాస పీల్చండి. పొగ లోపలికి వెళ్లదు" అని ధైర్యం చెప్పింది.

అప్పటికే ఆలస్యం అయింది. రాజు అనే పిల్లాడికి తీవ్రమైన ఆస్తమా లాంటి దగ్గు మొదలైంది. ఊపిరి పీల్చుకోలేక, ముఖం నీలంగా మారి నేలపై కూలబడ్డాడు. పిల్లలు భయంతో వేస్తున్న కేకలకు దగ్గర్లోని ఇండ్ల నుండి పరుగున కొందరు వచ్చి పిల్లలను ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

ఆ రాత్రి ఆనందపురంలో పిల్లల దగ్గుల చప్పుడు, అంబులెన్స్ సైరన్ మోతలు ఎక్కువ వినిపించాయి.

ఆసుపత్రికి తీసుకెళ్ళిన పిల్లల్ని ఊపిరితిత్తుల నిపుణుడు డాక్టర్ రాజీవ్ పరీక్షించారు.

ఆయన సరస్వతి అమ్మతో "పిల్లలు పీల్చింది మామూలు పొగ కాదు. ప్లాస్టిక్, రసాయనాలు కాలడం వల్ల 'డయాక్సిన్లు', 'ఫ్యూరాన్లు' లాంటి భయంకరమైన విషవాయువులు విడుదలవుతున్నాయి.

ఇవి ఊపిరితిత్తులను పాడు చేయడమే కాకుండా క్యాన్సర్‌కు దారితీస్తాయి. ఇలాగే వదిలేస్తే పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుంది. వాళ్ళ ఆరోగ్యాలు చెడిపోతాయి. స్నేహ నిలయం కాస్త శ్మశానంగా మారుతుంది" అన్నారు.

ఆమెతో బాటు ఆసుపత్రికి వచ్చిన నరగామస్థులు కూడా డాక్టర్ చెప్పింది విన్నారు. అయితే వాళ్లు ఆ విషయాన్ని తీవ్రంగా తీసుకోలేదు. సరికదా "డాక్టర్‌గారూ! చెత్త అక్కడ కాకపోతే ఎక్కడ వేస్తారు? ఇంత కాలం లేనిది ఇప్పుడేమవుతుంది?"



అన్నారు తేలిగ్గా. ఆ మాటలు ఆశ్రమం పిల్లలైన రాజు, సితారల మనసును గాయపరిచాయి.

"ఊరివాళ్లు స్వార్థంతో, నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారు. మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాలి" అన్నాడు రాజు ఆవేదనగా.

సితార "వాళ్లకు మాటలతో చెప్తే అర్థం కాదు. కళ్లకు కట్టేలా చూపిద్దాం!" అంది.

పిల్లలంతా ఒక సైన్యంగా ఏర్పడ్డారు. పర్యావరణంపై అవగాహన కోసం ఏం చేస్తే బాగుంటుందో బాగా ఆలోచించారు. తన పాత ఫోన్‌తో చెత్త నిల్వ ప్రదేశం దుస్థితిని, ప్లాస్టిక్ వల్ల పశువులు చనిపోతున్న దృశ్యాలను, ఆసుపత్రిలో శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న స్నేహ నిలయం పిల్లల బాధలను వీడియోలు తీశాడు రాజు.

సితార, అర్జున్ కలిసి రసాయన పొగ వల్ల ఊపిరితిత్తులెలా నల్లగా మారిపోతాయో చార్టులపై చిత్రాలు గీశారు. అర్జున్ ఒక పెద్ద బ్యానర్ తయారు చేశాడు "ఈరోజు మీరు కాల్చే ప్లాస్టిక్ రేపు మీ పిల్లల శ్వాసను తోడేస్తుంది!" అని రాసాడు.

ప్రతి గురువారం అక్కడికి దగ్గర్లో గ్రామ సంత జరుగుతుంది. అలా జనమంతా సంతలో గుమిగూడి ఉన్నప్పుడు స్నేహ నిలయం పిల్లలు ఒక వీధి నాటకం ప్రారంభించారు. అర్జున్ నల్లటి ముసుగు వేసుకుని "నేను ప్లాస్టిక్ రాక్షసుడిని.. నన్ను కాల్చితే నేను విషంగా మారి మీ రక్తాన్ని తాగుతాను" అంటూ గర్జించాడు.

మరోవైపు చిన్ని అనే అమ్మాయి దగ్గుతూ, ఊపిరి ఆడక నేలపై పడిపోతున్నట్లు నటించింది.

ఆ దృశ్యం ఎంత సహజంగా ఉందంటే, అక్కడ ఉన్న తల్లుల కళ్లలో నీళ్లు తిరిగాయి. పెద్దల గుండెల్లో పశ్చాత్తాపం మొదలైంది. ఆ నాటకాన్ని ఒక పత్రికా విలేకరి వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో అది వైరల్ అయ్యింది.

తాను పనిచేసే పత్రికలో కూడ ఈ విషయం గురించి రాయడంతో కలెక్టర్ గారికి తెలిసింది. ఆయన స్వయంగా అక్కడకి వచ్చి సమస్యను తెలుసుకున్నారు. పరిష్కారం కోసం ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని చెప్పారు.

అదలా ఉండగా.. ఒక రాత్రి ఆశ్రమం కిటికీ గుండా బయటకు చూస్తున్న రాజుకి ఏదో జరగకూడనిది జరుగుతున్న అనుమానం వచ్చింది. పక్కనే ఉన్న అర్జున్‌కి అటు వైపు చూపించాడు.

అదేమిటంటే డంపింగ్ యార్డ్ వైపు పెద్ద కంటైనర్ లారీ వెళ్లడం, కొందరు వ్యక్తులు కొన్ని డ్రమ్ములను



దింపి, చెత్తలో కలిపి నిప్పు పెట్టడం గమనించారు. ఆ మంటల నుండి వింతైన రంగుల పొగ రావడం వారికి కనబడింది.

రాజు "అర్జున్, అది మన ఊరి చెత్త కాదు. ఎక్కడో ఉన్న ఫ్యాక్టరీ తాలూకు రసాయనాల వ్యర్థాలు!" అని గుసగుసగా చెప్పాడు. ఇద్దరూ ధైర్యం చేసి చీకట్లోనే లారీ నంబర్, వాళ్లు చేస్తున్న పనిని చిత్రించే దృశ్యాలను వీడియో తీశారు.

తెల్లారిన తరువాత తాము తీసిన వీడియోను సరస్వతి అమ్మకి చూపించారు రాజు, అర్జున్.

జిల్లా కలెక్టర్ గారిని కలిసి ఆ వీడియోని అందించి ఫిర్యాదు చేసింది సరస్వతి అమ్మ. ఆమె ఫిర్యాదుతో అక్రమ ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని అరెస్ట్ చేసి, భారీ జరిమానా విధించారు. డంపింగ్ యార్డ్‌లో చెత్త కాల్చడాన్ని చట్టరీత్యా నేరంగా ప్రకటిస్తూ బోర్డులు పెట్టారు.

కలెక్టర్ ఆదేశాలు, పిల్లల స్ఫూర్తితో ఆనందపురం రూపురేఖలు కొద్దికొద్దిగా మారడం ప్రారంభమైంది. ప్రతి ఇంటికి తడి చెత్త, పొడి చెత్త అని రెండు బుట్టలు ఇచ్చారు. ఊరిలో ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించి, బట్ట సంచులను వాడటం మొదలుపెట్టారు. తడి చెత్తను గ్రామ శివార్లలో ప్రకృతిసిద్ధమైన ఎరువుగా మార్చి, పొలాలకు వాడుకోవడం ప్రారంభించారు. అన్నిటికంటే ముఖ్యంగా పిల్లల ఆధ్వర్యంలో "ఒక బిడ్డ ఒక మొక్క" అనే ఉద్యమం మొదలైంది. ఒకప్పుడు విషపు పొగలు చిమ్మిన ఆ చెత్త కొండను పూర్తిగా అక్కడి నుంచి తొలగించి, ఊరుకి దూరంగా కొండల మధ్యకి తరలించారు. చెత్త ఉండే స్థలంలో మైదానం తయారు చేశారు. అక్కడ పిల్లలంతా కలిసి వందలాది వేప, రావి, చింత, మామిడి మొక్కలు నాటారు.

కొన్నాళ్లు గడిచేసరికి అక్కడొక పచ్చని ఉద్యానవనం తయారైంది. అక్కడ సీతాకోకచిలుకలు తిరుగుతుండగా, మొక్కలకు నీళ్లు పోస్తున్న చిన్ని చేతుల్ని గాల్లోకి చాచి ఎంతో హాయిగా శ్వాస తీసుకుంది.

పక్కన ఉన్న సితారతో "అక్కా.. ఇక్కడ ఒకప్పుడు విషపు పొగ ఉండేది.. ఇప్పుడు పూల సువాసనలు వస్తున్నాయి. ఇలా చూస్తూ ఆడుకోవడం ఎంత బాగుందో కదా" అంది.

దూరం నుండి చూస్తున్న సరస్వతి అమ్మ కళ్లలో ఆనందబాష్పాలు మెరిశాయి. ఆమె "పర్యావరణాన్ని రక్షించడానికి పెద్ద చదువులు అక్కర్లేదు, స్వచ్ఛమైన సంకల్పం ఉంటే చాలు. సృష్టిని మార్చేయవచ్చు!" అనుకుంది.

ఆకాశంలో తెల్లటి మేఘాలు స్వేచ్ఛగా కదులుతుంటే, ఆనందపురంలో పిల్లల స్వచ్ఛమైన నవ్వులు మళ్లీ మారుమోగాయి. ■

# పూర్ణకుంభం - మన చారిత్రక వారసత్వం

ఆంధ్రప్రదేశ్ అధికారిక రాజముద్రగా గుర్తింపు పొందిన పూర్ణకుంభం (పూర్ణకలశం లేదా పూర్ణఘటం) కేవలం ఒక రాజచిహ్నం మాత్రమే కాదది.. యావద్ తెలుగు వారి ప్రాచీన సంస్కృతి సామాజిక సమగ్రత కళాత్మక వైభవం ప్రజల ఆధ్యాత్మిక దృక్పథానికి ప్రతీకగా నిలిచిన గొప్ప వారసత్వ చిహ్నం. ఈ రాజముద్రకు ఆధారమైన పూర్ణఘట శిల్పరూపం గుంటూరు జిల్లాలోని అమరావతి మహాస్తూపంలోని శిల్పకళ నుండి స్వీకరించబడింది. భారతీయ సంప్రదాయంలో పూర్ణకలశమనేది శుభప్రదమైన చిహ్నంగా భావించబడుతోంది. నీటితో నిండిన కుంభం దానిపై మామిడాకులు, కొబ్బరికాయతో అలంకరించిన కలశం సంపూర్ణత ఐశ్వర్యం సంతానం సస్యశ్యామం శుభకార్యాల ప్రారంభానికి సంకేతంగా పరిగణించబడుతుంది. నిండుకుండలాంటి వ్యక్తి సంసారం నిండుకుండలా ఉండాలి.. వంటి తెలుగు జాతీయాలు కూడా ఈ పూర్ణఘట భావన నుంచే పుట్టుకొచ్చాయి. అందువల్ల పూర్ణకుంభమనేది భౌతికసంపదకే కాకుండా జీవన విధానానికి సమృద్ధికి సామాజిక శ్రేయస్సుకు ప్రతీకగా నిలిచింది.

అమరావతి మహాస్తూపం బిసిఇ మూడవ శతాబ్దం నుండి ఎసిఇ రెండవ శతాబ్దం వరకు దాదాపు నాలుగున్నర శతాబ్దాల కాలంలో శాతవాహనుల పాలనలో అభివృద్ధి చెందింది. భారతదేశ బౌద్ధ శిల్ప కళాచరిత్రలో అమరావతి శిల్పశైలి ఒక ప్రత్యేక స్థానముంది. ఈ స్థూపంలోని అనేక శిలాఫలకాలపై దాతల పేర్లు వారి కుటుంబ వివరాలు వారు సమర్పించిన కళాఖండాల వివరాలు శాసనాల రూపంలో ఉన్నాయి. అటువంటి ఒక ప్రాచీన బ్రాహ్మీ శాసనం ఇక్కడి పూర్ణఘట శిల్పఫలకానికి సంబంధించిన విశేషమైన సమాచారాన్ని అందిస్తుంది. శాసన పాఠం కింద ఇవ్వడం జరిగింది.

సిద్ధం చమకరస నాగ ఉపఘరియ పతన విధికస సమతుకస నభయకన సుభతుకస పుతస చ నాగస నమధుతకస సనతి మితస బంధువస ధేయధమ్మ పుణఘటక వటో. ఈ శాసనానికి సాధారణ తెలుగు భావం ఏమిటంటే నాగుడు అనే చర్మకారుడు అతని భార్య సోదరులు కుమారుడు కుమార్తెలు



బంధువులు మిత్రులు కలిసి ధర్మకార్యార్థం ఈ పూర్ణఘట శిల్పఫలకాన్ని చెక్కించి అమరావతి మహాస్తూపానికి సమర్పించారు.

ఈ శాసనం ద్వారా ఆ కాలంలో బౌద్ధసంఘానికి ప్రజా ధార్మిక కార్యక్రమాలకు సమాజంలోని వివిధ వర్గాల ప్రజలు సమానంగా సహకరించినట్లు తెలుస్తుంది. నాగుడు వృత్తిరీత్యా చర్మకారుడైనా అతని కుటుంబం సమాజంలో గౌరవనీయ స్థానం కలిగి ఉన్నట్లు స్పష్టమవుతుంది. అతడు సమర్పించిన శిల్పఫలకాన్ని మహాస్తూపంలోని ముఖ్య శిల్పాల మధ్య ప్రతిష్ఠించడం ఆ గౌరవానికి నిదర్శనం. ఈ ఆధారం మనకు శాతవాహన యుగ సమాజం గురించి విలువైన సమాచారాన్ని అందిస్తుంది. వృత్తులు భిన్నమైనప్పటికీ సమాజంలో సామాజిక వివక్ష వంటి పద్ధతులు ఇంకా పూర్తిగా వేళ్లూనుకోలేదని అనేకమంది చరిత్రకారులు భావిస్తారు. ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలలో అన్నివర్గాల ప్రజలు భాగస్వాములయ్యే అవకాశాలు ఉండేవని ఈ శాసనం సూచిస్తోంది.

అమరావతి నాగార్జునకొండ ప్రాంతాలు ఆ కాలంలో బౌద్ధవిద్య తాత్విక చింతనలకు ప్రధాన కేంద్రాలుగా వెలుగొందాయి. అక్కడి స్తూపాలు విహారాలు శాసనాలు ఆంధ్రదేశం అంతర్జాతీయ బౌద్ధ సంస్కృతికి కేంద్రంగా ఉన్నదనే విషయాన్ని నిర్ధారిస్తున్నాయి.

బౌద్ధమతం అహింసను ప్రధానంగా బోధించినప్పటికీ బౌద్ధమతాన్ని అనుసరించిన అనేక మంది తమ సంప్రదాయ వృత్తులను పూర్తిగా విడిచిపెట్టలేదు. చర్మకారుడైన నాగుడు కూడా తన వృత్తిని కొనసాగిస్తూ ధర్మకార్యాలలో భాగస్వామి కావడం ద్వారా సమాజంలో శ్రమకు ఉన్న గౌరవాన్ని ప్రతిబింబించాడు. నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజముద్రగా ఉపయోగిస్తున్న పూర్ణకుంభంఒక కళాఖండం కాదు. అది అమరావతి బౌద్ధ సంస్కృతికి, శాతవాహన యుగ కళాసంపదకు, సమానత్వ భావనకు, శ్రమజీవుల సృజనాత్మకతకు, సమాజంలోని అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యానికి ప్రతీకగా నిలిచిన చారిత్రక చిహ్నం.

రెండు వేల సంవత్సరాల క్రితం ఒక శ్రమజీవి కుటుంబం ధర్మభావంతో సమర్పించిన ఆ శిల్పకళా వారసత్వం నేడు మొత్తం ఆంధ్రప్రదేశ్ ప్రజల గౌరవప్రతీకగా మారడం తెలుగు చరిత్రలో ఒక విశిష్టమైన ఘట్టం.

**– జి.బి.విశ్వనాథ్**

# భవిష్యత్తుకు బలమైన పునాది..

వేసవి సెలవులు ముగిసాయి. పిల్లలు పాఠశాలలకు పరుగులు తీస్తున్నారు. కొత్త పుస్తకాలు, కొత్త బట్టలు కొత్త స్నేహాలు ఆనందపరుస్తాయి. పిల్లలు ఆడుతూ, పాడుతూ ఆహ్లాదంగా చదువుకునే వాతావరణం కల్పించాలి. ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దాలి. నేటి ప్రపంచంలో కేవలం డిగ్రీలు సంపాదించడం మాత్రమే ఉద్యోగ సాధనకు సరిపోవడంలేదు. విద్య పూర్తయిన తరువాత కూడా యువత సాంకేతిక, వృత్తి నైపుణ్యాలతో పాటు జీవన నైపుణ్యాల్లో ప్రత్యేక శిక్షణ పొందాల్సి వస్తోంది. ముఖ్యంగా భావ వ్యక్తీకరణ, జట్టుగా పనిచేయడం, సమస్యలను విశ్లేషించి పరిష్కరించడం, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడం, నాయకత్వ లక్షణాలు వంటి సామర్థ్యాలకు ప్రాధాన్యత పెరిగింది.

నిజానికి ఇవి ఒక్కసారిగా పెద్దయ్యాక నేర్చుకునే లక్షణాలు కావు. బాల్యంలోనే కుటుంబ వాతావరణం, పరిసరాలు, విద్యాబోధన, అనుభవాలు కలిసి వ్యక్తిత్వానికి పునాది వేస్తాయి. ప్రకృతి పాఠశాలగా, ఇల్లు వికాస నిలయంగా, విద్యాలయం జ్ఞాన కేంద్రంగా మారితే ప్రతి బాలుడు సమగ్ర వ్యక్తిగా ఎదగగలడు. అందుకే వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన బాటలు బాల్యం నుంచే వేయాలి. పిల్లలను పరీక్షల్లో మార్కులు సాధించే యంత్రాలుగా కాకుండా ఆలోచించే మనుషులుగా



తీర్చిదిద్దాలి. బాల్యంలో ఇచ్చే ప్రేమ, విలువలు, అనుభవాలు, విద్య, జీవన నైపుణ్యాలే భవిష్యత్ సమాజ నాణ్యతను నిర్ణయిస్తాయి. ఒక బాలుడి వికాసం అంటే కేవలం ఒక వ్యక్తి ఎదుగుదల మాత్రమే కాదు; రేపటి సమాజ నిర్మాణానికి వేసే పునాది.

"పిల్లలను భవిష్యత్తుకు సిద్ధం చేయడం అంటే వారికి సమాచారం ఇవ్వడం కాదు; ఆలోచించే శక్తి, అనుభూతి చెందే హృదయం, సమాజంతో కలిసి జీవించే సంస్కారం ఇవ్వడం." మనిషి వ్యక్తిత్వ నిర్మాణం యవ్వనంలో లేదా ఉద్యోగ జీవితంలో ప్రారంభం కాదు; అది బాల్యంలోనే మొదలవుతుంది. ముఖ్యంగా జననం నుంచి తొలి పది సంవత్సరాల వరకు మెదడు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఈ దశలో పిల్లలకు లభించే ప్రేమ, భద్రత, సంభాషణలు, ఆటలు, అనుభవాలు, విద్యాబోధన వారి మెదడు నిర్మాణాన్ని, ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తాయి. మనోవిజ్ఞాన పరిశోధనలు బాల్యంలో ఏర్పడే అనుభవాలే భవిష్యత్తులో వ్యక్తి భావోద్వేగ నియంత్రణ, నిర్ణయ సామర్థ్యం, మానవ సంబంధాలు, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలకు పునాది వేస్తాయని స్పష్టం చేస్తున్నాయి. కేవలం పాఠ్యాంశాల బోధన సరిపోదు. పరిశీలన, ప్రశ్నించడం, సృజనాత్మకత, సమస్యల పరిష్కారం, జట్టుగా పనిచేయడం వంటి జీవన నైపుణ్యాలు చిన్ననాటి నుంచే పెంపొందించాలి.

కుటుంబం భావోద్వేగ భద్రతనిచ్చే వికాస కేంద్రంగా, ప్రకృతి అనుభవాలను నేర్పే సహజ పాఠశాలగా, విద్యాలయం జ్ఞానం-విలువలు-నైపుణ్యాలు అందించే వేదికగా మారితేనే పిల్లలు సమగ్ర వ్యక్తిత్వంతో ఎదుగుతారు. అందుకే బాల్యం అనేది కేవలం పెరుగుదల దశ కాదు; భవిష్యత్తు వ్యక్తిత్వానికి పునాది వేసే అత్యంత కీలక దశ.

## మెదడుకు పదును

మనిషిని నడిపించేది మెదడే. అది గర్భంలోనే రూపుదిద్దుకుంటుంది. దానిపై తల్లి మానసిక, శారీరక స్థితి ప్రభావం చూపుతుంది.

అప్పుడే పుట్టిన శిశువు మెదడు పెద్దవారి మెదడుతో పోలిస్తే దాదాపు 25 శాతం పరిమాణాన్ని కలిగి ఉంటుంది. పుట్టిన తర్వాత మొదటి కొన్ని సంవత్సరాల్లో ఈ ఎదుగుదల అత్యంత వేగంగా సాగుతుంది. పుట్టిన మొదటి మూడు నెలల్లో శిశువు మెదడు ప్రతిరోజూ దాదాపు ఒక శాతం చొప్పున పెరుగుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. శిశువుకు ఒక సంవత్సరం వచ్చేసరికి మెదడు పరిమాణం రెట్టింపు అవుతుంది. అప్పటికి అది పెద్దవారి మెదడులో దాదాపు 60 శాతం వరకు ఎదుగుతుంది. ఈ దశలో పిల్లలు బోర్లా పడటం, కూర్చోవడం, వస్తువులు పట్టుకోవడం వంటి సామర్థ్యాలు నేర్చుకుంటారు. రెండు నుంచి మూడు సంవత్సరాల వయస్సులో మెదడు పెద్దవారి మెదడు బరువులో 75 శాతానికి చేరుతుంది. మూడు సంవత్సరాల వయస్సులో ఇది 80 శాతం వరకు అభివృద్ధి చెందుతుంది. ఈ సమయంలో మెదడు కణాల మధ్య అనుసంధానాలు బలపడతాయి. అందువల్ల పిల్లలు మాటలు, భాషను వేగంగా గ్రహిస్తారు. ఐదేళ్లకు 90 శాతం, ఆరేళ్లకు దాదాపు 95 శాతం ఎదుగుదల పూర్తవుతుంది. అందుకే

ఈ వయస్సులోపు పిల్లలకు అందించే వాతావరణం, నేర్పించే విషయాలు భవిష్యత్తుకు బలమైన పునాదిగా మారతాయి. శిశువు మెదడు పెరుగుదల అంటే కొత్త కణాలు పుట్టడం మాత్రమే కాదు. పుట్టుకతోనే అవసరమైన ఎక్కువ శాతం కణాలు సిద్ధంగా ఉంటాయి. కానీ పుట్టిన తర్వాత కణాల మధ్య అనుసంధానాలు బలపడతాయి. చూసేది, వినేది, స్పర్శ ద్వారా ప్రతి క్షణం కొత్త నాడీ సంబంధాలు ఏర్పడుతుంటాయి. పిల్లలు తీసుకునే ఆహారంలో లభించే శక్తిలో దాదాపు అరవై శాతం మెదడు ఎదుగుదలకే వినియోగమవుతుంది. అందుకే పోషకాలు కలిగిన ఆహారం అవసరం. ప్రేమగా మాట్లాడటం, ఆడించడం, కథలు చెప్పడం కూడా మెదడు చురుకుదనాన్ని పెంచుతాయి.

## వ్యక్తిత్వ నిర్మాణానికి పునాదులు

మనిషి వ్యక్తిత్వం ఒక్కరోజులో ఏర్పడదు. పుట్టిన తర్వాత తొలి సంవత్సరాల్లో పొందిన అనుభవాలు, కుటుంబ వాతావరణం, ప్రేమాభిమానాలు, నేర్చుకున్న అలవాట్లు, భావోద్వేగ అనుభూతుల కలయికతో క్రమంగా నిర్మితమవుతుంది. మనోవిజ్ఞాన శాస్త్రవేత్త జీన్ పియాజే అభిప్రాయం ప్రకారం చిన్ననాటి అనుభవాలే పిల్లల్లో ఆలోచనా వికాసానికి పునాది వేస్తాయి. అలాగే ఎరిక్ ఎరిక్సన్ సిద్ధాంతం ప్రకారం జీవితపు తొలి దశల్లో పిల్లలు పొందే భద్రతాభావమే భవిష్యత్తులో వారి ఆత్మవిశ్వాసం, సామాజిక సంబంధాలు, భావోద్వేగ స్థిరత్వాన్ని నిర్ణయిస్తుంది.



పిల్లలతో తల్లిదండ్రులు ఎలా మాట్లాడుతున్నారు అన్నది కూడా చాలా కీలకం. ప్రేమగా మాట్లాడటం, కథలు చెప్పడం, ప్రశ్నలు అడగనివ్వడం, వారి భావాలను గౌరవించడం వంటివి భాషా వికాసంతో పాటు భావ వ్యక్తీకరణ సామర్థ్యాన్ని పెంచుతాయి. ఎప్పుడూ మందలించడం, భయపెట్టడం, ఇతరులతో పోల్చడం వంటి చర్యలు పిల్లల్లో ఆందోళన, భయం, ఆత్మన్యూనత భావాలను పెంచుతాయి. ఆటల ద్వారా సమస్య పరిష్కారం, నిర్ణయ సామర్థ్యం, సృజనాత్మకత, సామాజిక ప్రవర్తన వంటి నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. పోషకాహారం పిల్లల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, మానసిక చురుకుదనాన్ని పెంచుతుంది.

వ్యక్తిత్వ వికాసం అంటే కేవలం చదువులో ప్రతిభ కాదు. సహానుభూతి, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఇతరుల పట్ల గౌరవం, బాధ్యతాయుత ప్రవర్తన వంటి లక్షణాలు పెంపొందించడం కూడా అంతే ముఖ్యం. అమెరికన్ మనోవిజ్ఞాన శాస్త్రవేత్త ఆల్బర్ట్ బందూరా ప్రతిపాదించిన సామాజిక అభ్యాస సిద్ధాంతం ప్రకారం పిల్లలు వినడం కంటే చూసి ఎక్కువ నేర్చుకుంటారు. తల్లిదండ్రుల ప్రవర్తనే పిల్లల భవిష్యత్తు వ్యక్తిత్వానికి నమూనా అవుతుంది. ఇప్పటి కాలంలో చిన్న వయస్సులోనే మొబైల్ ఫోన్, టెలివిజన్, వీడియో ఆటలకు ఎక్కువగా అలవాటు చేయడం పిల్లల దృష్టి కేంద్రీకరణ, భాషా వికాసం, సామాజిక ప్రవర్తనపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. అందువల్ల ప్రత్యక్ష సంభాషణలు, ఆటలు, కథలు, కుటుంబంతో గడిపే సమయం ఎక్కువ అవసరం.

## సమగ్ర వికాసానికి ఎనిమిది మార్గాలు

**1. శారీరక ఆరోగ్యం:** ఆరోగ్యకరమైన శరీరం లేకుండా మానసిక వికాసం పూర్తి కాదు. రోజూ వ్యాయామం, ఆటలు, యోగ సాధన, పరుగులు, సమతుల్య ఆహారం అవసరం. **2. మానసిక వికాసం:** పిల్లలు కంఠస్థం చేయడం మాత్రమే కాదు; ప్రశ్నించడం, విశ్లేషించడం, కొత్తగా ఆలోచించడం నేర్చుకోవాలి. **3. భావోద్వేగ సమతుల్యత:** కోపం, భయం, నిరాశ, పోటీ ఒత్తిడిని ఎలా నియంత్రించాలో చిన్నప్పటి నుంచే నేర్పాలి. వైఫల్యాన్ని ఎదుర్కొనే మానసిక బలం పెంచాలి. **4. మానవ సంబంధాలు:** ఇతరులతో మాట్లాడటం, జట్టుగా పని చేయడం, సహకరించడం, విభేదాలను శాంతియుతంగా పరిష్కరించడం నేర్పాలి.

**5. నైతిక విలువలు:** నిజాయితీ, క్రమశిక్షణ, గౌరవం, బాధ్యత, సహాయం చేసే స్వభావం వంటి విలువలు ఇంట్లోనే మొదట నేర్చుకుంటారు. **6. జీవన నైపుణ్యాలు:** నిర్ణయాలు తీసుకోవడం, సమస్యలను పరిష్కరించడం, సమయపాలన, నాయకత్వం, భావ వ్యక్తీకరణ, సృజనాత్మకత నేర్పాలి. **7. తెర సమయం తగ్గించాలి:** మొబైల్, సామాజిక మాధ్యమాలు, వీడియో ఆటలపై అధిక ఆధారపడటం దృష్టి వికేంద్రీకరణకు దారితీస్తుంది. ఆటలు, పాటలు, అభిరుచులు పెంచాలి.

**8. తల్లిదండ్రులు, గురువులే శిల్పులు:** రాయిని శిల్పంగా చెక్కితే పూజలు అందుకుంటుంది. పిల్లలను సమగ్ర వ్యక్తులుగా తీర్చిదిద్దితే సమాజం గౌరవిస్తుంది. ఉపాధ్యాయుడు జ్ఞానం నేర్పుతాడు; తల్లిదండ్రులు జీవన విలువలు నేర్పుతారు. ఇద్దరూ కలిసి పనిచేసినప్పుడే పిల్లలు సమగ్ర వ్యక్తులుగా ఎదుగుతారు. నర్సరీ నుంచి పదో తరగతి వరకు కాలం కేవలం చదువు దశ కాదు; అది వ్యక్తిత్వ నిర్మాణ దశ. మన విద్యా వ్యవస్థ పిల్లలను మార్కుల కోసం చదివే విద్యార్థులుగా కాకుండా శారీరకంగా ఆరోగ్యవంతులు, మానసికంగా దృఢులు, విలువలతో కూడిన బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాలి. "పిల్లలకు పాఠాలు నేర్పడం కన్నా జీవితం నేర్పించడం గొప్ప విద్య."

– డాక్టర్ ఎన్.బి.సుధాకర్ రెడ్డి

# వారసత్వ సంపద.. నదులు

ఒక తరం నుంచి మరో తరానికి మనుషులు ఎన్నో వారసత్వాలను అందిస్తారు. భూములు, ఇళ్లు, సంపదలు, సంప్రదాయాలు, భాషలు, సంస్కృతులు.. ఇవన్నీ వారసత్వాలే. కానీ వీటన్నింటికంటే విలువైన ఒక వారసత్వం ఉంది. అది నీరు. ముఖ్యంగా నదులు. ఎందుకంటే మనిషి నిర్మించిన ఏ సంపద అయినా కాలంతో క్షీణించవచ్చు. కానీ ఒక ఆరోగ్యకరమైన నది తరతరాలకు జీవనాన్ని అందించగలదు.

చరిత్రను పరిశీలిస్తే ప్రతి గొప్ప నాగరికత వెనుక ఒక నది కనిపిస్తుంది. నదులు కేవలం భూమిని తడపలేదు; మానవ ఆలోచనలను కూడా సుసంపన్నం చేశాయి. వ్యవసాయం అభివృద్ధి చెందడానికి, గ్రామాలు ఏర్పడడానికి, వ్యాపార మార్గాలు విస్తరించడానికి, కళలు వికసించడానికి నదులే పునాది అయ్యాయి. అందుకే మన పూర్వీకులు నదులను ప్రకృతి వనరులుగా మాత్రమే కాకుండా జీవనాధారాలుగా గౌరవించారు. అయితే నేడు పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. జనాభా పెరుగుతోంది. నీటి అవసరాలు విస్తరిస్తున్నాయి. నగరాలు విస్తరిస్తున్నకొద్దీ నదుల సహజ మార్గాలు కుంచించుకుపోతున్నాయి. ఒకప్పుడు స్వచ్ఛంగా ప్రవహించిన ప్రవాహాలు ఇప్పుడు కాలుష్య భారాన్ని మోస్తున్నాయి. కొన్ని నదులు వర్షాకాలంలో మాత్రమే కనిపించే పరిస్థితికి చేరుకున్నాయి.

ఈ మార్పులు ప్రకృతికి మాత్రమే కాదు, మానవ సమాజానికీ హెచ్చరికలుగా మారుతున్నాయి. నదుల విలువను మనం చాలాసార్లు నీటి కొరత వచ్చినప్పుడు మాత్రమే గుర్తిస్తున్నాం. కానీ ఒక నది ప్రాధాన్యం దాహం తీర్చడంలో మాత్రమే లేదు. ఆమె భూగర్భ జలాలను నింపుతుంది. పంటలకు జీవం పోస్తుంది. వాతావరణ సమతుల్యతను కాపాడుతుంది. అనేక జీవరాశులకు ఆశ్రయం కల్పిస్తుంది. ఒక నది ఆరోగ్యంగా ఉంటే చుట్టుపక్కల జీవ వ్యవస్థ కూడా ఆరోగ్యంగా ఉంటుంది. నదులపై



మన దృక్పథంలో ఒక మౌలిక మార్పు అవసరం. ఇప్పటివరకు వాటిని వినియోగించాల్సిన వనరులుగా చూశాం. ఇకపై సంరక్షించాల్సిన సహజ వారసత్వంగా చూడాలి. ప్రకృతి మనకు ఇచ్చిన ఈ అమూల్య సంపదను పూర్తిగా వినియోగించడం అభివృద్ధి కాదు. దాన్ని భవిష్యత్ తరాలకు కూడా అందుబాటులో ఉంచడం నిజమైన అభివృద్ధి. నేడు ప్రపంచం వాతావరణ మార్పుల ప్రభావాన్ని అనుభవిస్తోంది. ప్రకృతితో సమతుల్యత కోల్పోతే మనిషి ఎంత సాంకేతికంగా ఎదిగినా సమస్యల నుంచి తప్పించుకోలేడని ఇవి గుర్తు చేస్తున్నాయి.

నదుల పరిరక్షణలో ప్రభుత్వాల పాత్ర ఎంత ముఖ్యమో, ప్రజల పాత్ర కూడా అంతే ముఖ్యమైనది. ఒక నదిని కాపాడటం అనేది పెద్ద ప్రాజెక్టులతో మాత్రమే సాధ్యం కాదు. నీటిని వృథా చేయకుండా ఉపయోగించడం, చెరువులను పునరుద్ధరించడం, వర్షపు నీటిని భద్రపరచడం, నదుల్లో చెత్త వేయకుండా జాగ్రత్తపడడం వంటి చిన్న చర్యలతోనే పెద్ద మార్పు సాధ్యమవుతుంది. ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తిస్తే నదుల భవిష్యత్తు మరింత సురక్షితంగా ఉంటుంది.

ముఖ్యంగా యువతలో జలసంరక్షణ పట్ల చైతన్యం పెరగాలి. పాఠశాలల్లో, కళాశాలల్లో నీటి విలువపై చర్చలు జరగాలి. పర్యావరణ పరిరక్షణను ఒక పాఠ్యాంశంగా మాత్రమే కాకుండా జీవన విలువగా బోధించాలి. ఎందుకంటే రేపటి నిర్ణయాలు తీసుకునేది ఈ తరం యువతే. ఒక సమాజం నదులను చూసుకునేదాన్నిబట్టి ఆ సమాజం భవిష్యత్తు నిర్ణయించబడుతుంది. నదులను కాలుష్యంతో నింపితే సమస్యలను వారసత్వంగా అందిస్తాం. నదులను సంరక్షిస్తే అవకాశాలను వారసత్వంగా అందిస్తాం. ఈ ఎంపిక మన చేతుల్లోనే ఉంది. మన పిల్లలకు మనం ఎలాంటి ప్రపంచాన్ని అందించాలనుకుంటున్నాం? నీటి కోసం పోరాడే ప్రపంచాన్నా? లేక ప్రకృతితో సమతుల్యత సాధించిన ప్రపంచాన్నా? ఈ ప్రశ్నకు సమాధానం మన చర్యల్లో కనిపించాలి. నదులు కేవలం ప్రవహించే జలరాశులు కావు. అవి కాలాన్ని కలిపే వంతెనలు. గతాన్ని వర్తమానంతో, వర్తమానాన్ని భవిష్యత్తుతో అనుసంధానించే జీవనరేఖలు. నదులను కాపాడటం అంటే ప్రకృతిని కాపాడటం కాదు;

మన సంస్కృతిని, మన ఆర్థిక వ్యవస్థను, మన భవిష్యత్తును కాపాడటం.తరతరాల నుంచి మనకు అందిన ఈ అమూల్య వారసత్వాన్ని మరింత సుసంపన్నంగా రాబోయే తరాలకు అందించడం మన బాధ్యత.

– చిటికెన కిరణ్‌కుమార్

# వైవిధ్యమైన తులిప్ పూలు

**ప్రపంచవ్యాప్తంగా** అత్యంత ప్రజాదరణ పొందిన పూలలో ఒకటి తులిప్. వైవిధ్యమైన అందంతో ఈ పూలు అందరినీ ఆకర్షిస్తుంటాయి. తులిప్ పూల పేరు చెప్పగానే అందరికీ నెదర్లాండ్స్ గుర్తుకు వస్తుంది. అక్కడ ఈ పూల ఉత్పత్తి అధికంగా ఉంటుంది. తులిప్ పువ్వులు మొదటగా మధ్య ఆసియా, దక్షిణ యూరప్‌లోని పర్వత ప్రాంతాలు, గడ్డి మైదానాలలో సహజంగా పెరిగేవి.

## చరిత్ర

'తులిప్' అనే పేరు పర్షియన్, తుర్కీ మూలాల నుంచి వచ్చింది. 'తులిప్' అనే పేరు టర్కిష్ పదమైన 'తుల్బెంట్' (తలపాగా) నుండి వచ్చింది. టర్కీ ప్రజలు తమ తలపాగాను 'తులిపంద్' అని పిలిచేవారు. ఈ పువ్వు ఆకారం తలపాగాను పోలి ఉండటంతో దీనికి 'తులిప్' అనే పేరు వచ్చింది. చాలామంది తులిప్స్ అనగానే నెదర్లాండ్స్ దేశాన్ని గుర్తుచేసుకుంటారు. కానీ నిజానికి తులిప్ పూల మూలాలు మధ్య ఆసియాలో ఉన్నాయి. తులిప్ పూలు మధ్య ఆసియాలో ప్రధానంగా కజకిస్తాన్, ఇరాన్, తుర్కమేనిస్తాన్ ప్రాంతాలతో పాటు హిమాలయాలు, మధ్యధరా సముద్రం, ఆసియాలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణంగా పెరుగుతుంటాయి. పర్షియా (ఇరాన్)లో 10వ శతాబ్దం నుంచి తులిప్ పూలను సాగు చేశారు. పర్షియన్ కవులలో ఒమర్ ఖయ్యాం వంటి అనేకమంది తులిప్ అందాన్ని గానం చేసి మరీ ప్రపంచానికి చాటి చెప్పారు. ఒట్టోమన్ సామ్రాజ్యంలో సెల్జుక్, ఒట్టోమన్ తుర్కులు తులిప్‌ల ఎంతో ఇష్టపడ్డారు. 11వ శతాబ్దం నుంచి కాన్స్టాంటినోపుల్ (ఇప్పటి ఇస్తాంబుల్)లో సాగు చేశారు. ఒట్టోమన్ సామ్రాజ్యంలో సుల్తాన్ సులేమాన్ కాలం వీటిని ఎంతో ఆదరించింది. వారి రాజభవనాలు, తోటలలో తులిప్ పూలు ముఖ్యమైన స్థానాన్ని పొందాయి. సుల్తానులు తమ ఉద్యానవనాల్లో వేలాది తులిప్ మొక్కలను నాటించేవారు.




తులిప్ ఒట్టోమన్ కళలోను, సంస్కృతిలో ముఖ్యమైన స్థానం పొందింది. 16వ శతాబ్దంలో యూరోపియన్ డిప్లమాట్లు ఒట్టోమన్ కోర్టులో తులిప్‌లను చూశారు. 16వ శతాబ్దం మధ్య కాలంలో, టర్కీలోని ఆస్ట్రియన్ రాయబారి ఒగియర్ ఘిస్లిన్ డి బుస్బెక్ ఈ పూల దుంపలను వియన్నాకు పంపారు. అక్కడ నుండి ఇవి ప్రముఖ వృక్షశాస్త్రజ్ఞుడు కరోలస్ క్లూసియస్ చేతుల్లోకి మారాయి. ఆయన నెదర్లాండ్స్‌లోని లైడెన్ విశ్వవిద్యాలయంలో తులిప్స్ పెంచడం ప్రారంభించి అధ్యయనం చేశాడు. డచ్ వాతావరణానికి ఈ పూలు అద్భుతంగా పెరగసాగాయి. ఈ విధంగా యూరప్ తులిప్ జనాదరణకు నోచుకుంది. 1600ల సంవత్సరం ప్రారంభం నుంచే తులిప్ పూలను నాటడానికి ఉపయోగించే దుంపల ధరలు పెరుగుతున్నప్పటికీ, వాటి విలువ గురించి ప్రచారం పెరగడంతో ప్రజలు భారీగా పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు. 1630లో డచ్ స్వర్ణయుగ కాలంలో తులిప్‌లు అత్యంత విలాసవంతమైన వస్తువులుగా మారాయి. 1636 నాటికి అరుదైన తులిప్ దుంపల ధరలు ఇళ్ల ధరలకు సమానంగా చేరుకున్నాయి. వేలాది మంది తులిప్ వ్యాపారంలో పాల్గొన్నారు. తులిప్ చరిత్రలోనే అత్యంత విచిత్రమైన ఘట్టం 1634-1637 మధ్య నెదర్లాండ్స్ జరిగింది. దీనిని 'తులిప్ మేనియా' అంటారు.

ఆ రోజుల్లో తులిప్స్ ఒక విలాసవంతమైన వస్తువుగా మారిపోయాయి. ధనికులు వీటిని అంతస్తుకు చిహ్నంగా భావించారు. ఒక దశలో కొన్ని అరుదైన తులిప్ దుంపల ధరలు ఎంతగా పెరిగాయంటే ఒకే ఒక్క తులిప్ దుంప ధరతో ఆమ్‌స్టర్‌డమ్ నగరంలో ఒక పెద్ద ఇల్లు, లేదా ఎన్నో ఎకరాల భూమిని కొనేసేవారు! ఫిబ్రవరి 1637లో ఒక్కసారిగా ఈ మార్కెట్ కుప్పకూలిపోయింది. కొనేవారు లేక ధరలు పాతాళానికి పడిపోయాయి. దీనివల్ల ఎంతోమంది డచ్ వ్యాపారులు రాత్రికి రాత్రే రోడ్డున పడ్డారు. ఇది ప్రపంచ చరిత్రలోనే నమోదైన మొదటి ఆర్థిక ఇబ్బంది. ఆర్థిక సంక్షోభం దాటిన తర్వాత కూడా డచ్ ప్రజలు తులిప్స్‌ను వదల్లేదు. నేడు నెదర్లాండ్స్ ప్రపంచంలోనే అతిపెద్ద తులిప్ ఉత్పత్తిదారుగా, ఎగుమతిదారుగా నిలిచింది. అక్కడ ఉన్న 'క్యుకెన్‌హాఫ్' తోట ప్రపంచంలోనే అతిపెద్ద పూల తోటగా పేరుగాంచింది.

## తులిప్ పూలను ఎక్కువగా పండిస్తున్న దేశాలు

ప్రపంచ తులిప్ మార్కెట్‌లో నెదర్లాండ్స్ దేశానికి తిరుగులేని ఆధిక్యంలో ఉంది. మొత్తం ప్రపంచ సరఫరాలో అత్యధిక వాటా ఈ దేశానిదే. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద తులిప్ ఉత్పత్తి దేశంగా ఖ్యాతినార్జించింది. ఈ దేశం ఏటా సుమారు 300 కోట్ల బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జిస్తోంది. నెదర్లాండ్స్ తర్వాత ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, బ్రిటన్, డెన్మార్క్, పోలాండ్, లాట్వియా, తుర్కియే వంటి దేశాలతో పాటు అమెరికా, కెనడా, జపాన్, న్యూజిలాండ్..

దేశాల్లో కూడా తులిప్ పూలను వాణిజ్యపరంగా పండిస్తున్నారు. తులిప్ పూలు అత్యధికంగా ఉత్పత్తి అయ్యే నెదర్లాండ్స్ నుండి అమెరికా, కెనడా, భారతదేశాలకు ఎక్కువగా అనునిత్యం తులిప్ పూలు ఎగుమతి అవుతున్నాయి.. ముఖ్యంగా అమెరికాలో వివాహాలు, ఈవెంట్లు, గిఫ్టింగ్ ఇత్యాది అవసరాల కోసం తులిప్స్‌ను ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నారు. వీటితో పాటు యూరప్ దేశాలైన జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీ, ఆసియా పసిఫిక్ దేశాలైన చైనా, జపాన్, సౌత్ కొరియా ఇత్యాది దేశాలకు కూడా ఈ మధ్య కాలంలో తులిప్స్ వినియోగం విపరీతంగా పెరిగడంతో వారంతా దిగుమతి చేసుకుంటున్నారు. చైనాలోని అనేక ఉద్యాన వనాలలో తులిప్ పూలను విపరీతంగా పెంచి పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తున్నారు.



గ్లోబల్ ఫ్లోరికల్చర్ మార్కెట్ విశ్లేషణల ప్రకారం తులిప్ పూలు ప్రపంచవ్యాప్తంగా భారీ ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి. 2026 నాటికి అంతర్జాతీయ మార్కెట్లో కేవలం తులిప్ పూలు వ్యాపార విలువ సుమారు 8.9 బిలియన్ డాలర్లు గా అంచనా వేశారు. మొత్తం యూరప్ మార్కెట్ విలువలో నెదర్లాండ్స్ వార్షిక ఆదాయం సుమారు 38.7 వాటాను కలిగి ఉండటంతో పాటు, గ్లోబల్ ఎగుమతుల్లో అగ్రస్థానంలో ఉన్న నెదర్లాండ్స్ తులిప్స్ ద్వారా ఏటా 300 కోట్ల బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జిస్తోంది. కేవలం తులిప్స్ పూల రూపంలోనే కాక తోటల్లో నాటుకునే దుంపల రూపంలో కూడా భారీగా ఆదాయాన్ని గడిస్తున్నారు.



## భారతదేశంలో తులిప్ పూల పంట

భారతదేశంలో తులిప్ పూలు ప్రధానంగా జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో పర్యాటకుల్ని ఆకర్షించేందుకు 2007 నుండి అత్యధికంగా పండిస్తున్నారు. దీనితో పాటు హిమాచల్ ప్రదేశ్ (పాలంపూర్), ఉత్తరాఖండ్, దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి ప్రాంతంలో, ముఖ్యంగా ఆంధ్రా కాశ్మీర్‌గా పేరొందిన లంబసింగి, పరిసర ప్రాంతాల్లో ఈ తులిప్ పూల ప్రయోగాత్మక సాగు విజయవంతంగా చేపట్టారు.

## తులిప్‌లో వేలాది రకాలు

తులిప్ పువ్వులు ప్రపంచంలో అత్యంత గుర్తింపు పొందిన పుష్పాలలో ఒకటి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా వీటిలో 75 జాతులు, 3000 కంటే ఎక్కువ రకాలు గుర్తించారు. కొత్త రకాలను నిరంతరం అభివృద్ధి చేస్తున్నారు. నీలం రంగు తప్ప అన్ని రంగుల్లో తులిప్‌లు ఉంటాయి. కానీ సహజంగా నీలం రంగు తులిప్‌లు లేవు. పుష్పాలలో నీలం రంగు చాలా అరుదైనది. 'నీలం తులిప్'గా పిలిచేవి సాధారణంగా ఊదా లేదా లేత ఊదా రంగులో ఉంటాయి.

## పలు అర్థాలకు ప్రతీక తులిప్ పూల రంగులు

తులిప్ పూల రంగులను పలు అర్థాలకు ప్రతీకగా ఈ పూల ప్రేమికులు భావిస్తుంటారు. ఎరుపు తులిప్‌లను ప్రేమ, అభిరుచి, రొమాన్స్ కు ప్రతీకలుగా భావిస్తారు. పర్షియన్ గాథ ప్రకారం ఫహద్. షిరిన్ అనే ప్రేమికులు మరణించినప్పుడు వారి రక్తం నుండి ఎరుపు తులిపులు మొలిచాయని, అందుకే ఇవి శాశ్వత ప్రేమకు చిహ్నంగా భావిస్తారు. గులాబీ తులిప్‌లు ఆప్యాయత, శుభాకాంక్షలు, విశ్వాసాన్ని సూచిస్తాయి. ఊదా తులిప్‌లు రాజసం, గౌరవం, శోభను సూచిస్తాయి. పసుపు తులిప్‌లు సంతోషం, ఆనందం, ఉల్లాసానికి ప్రతీకలు. విక్టోరియన్ కాలంలో ఇవి 'నీ చిరునవ్వులో సూర్యకాంతి ఉంది..' అనే సందేశాన్ని సూచించేవి. తెలుపు తులిప్‌లు పవిత్రత, క్షమ, శాంతిని సూచిస్తాయి.

## తులిప్‌లు తినదగినవి

తులిప్ రేకులు తినవచ్చు. వాటికి కొద్దిగా తియ్యని రుచి ఉంటుంది. అందువల్ల కేకులు, పానీయాల అలంకరణలో ఉపయోగిస్తారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో నెదర్లాండ్స్‌లో ఆహార కొరత ఏర్పడినప్పుడు ప్రజలు తులిప్ దుంపలను కూరగాయలకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించారు. వాటిని పిండి, కాఫీ ఇత్యాది వాటికి ప్రత్యామ్నాయాలుగా కూడా వాడారు. నేటికీ తులిప్ పూల గుత్తులు ఇంటికి అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి. తులిప్ పూల అద్భుత వైభవాన్ని చూడాలంటే నెదర్లాండ్స్, హాలండ్‌కు వెళ్లాల్సిందే. నేటికీ తులిప్ నెదర్లాండ్స్ పుష్ప పరిశ్రమలో అత్యంత ముఖ్యమైన పువ్వుగా ఉంది. అక్కడి పొలాల్లో దాదాపు సగం భాగం తులిప్ సాగుకే కేటాయిస్తున్నారు. వివిధ రంగులు, ఆకారాల్లో ఉన్న పలు రకాల జాతుల తులిప్‌ల పాటు వేలాది సంకరజాతులను అక్కడ చూడవచ్చు.

– షేక్ అబ్దుల్ హకీం జాని

# 'బుద్బుద వేధ' అంటే ఏమిటి?

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్: 9885446501/9885449458

**సి.శరవణన్, నాయుడుపేట**

**ప్రశ్న: 'బుద్బుద వేధ' అంటే ఏమిటి? వివరించగలరు.**

**జవాబు:** 'బుద్బుదము' అంటే నీటి బుడగ అని అర్థం. భూమి లోపలి నుండి భూమిపై భాగానికి నీరు/నీటి బుడగలు తామంత తామే వస్తున్నట్లయితే 'బుద్బుదము' అనవచ్చు. ఒక గృహంలో గృహావరణలో కానీ ఈ విధంగా నీరు భూమి లోపలి నుండి తమంతట తామే పైకి వస్తున్నట్లయితే ఆ గృహం 'బుద్బుద వేధ' అనే వాస్తు దోషం కలిగి వుంటుంది.

గృహానికి 'బుద్బుద వేధ' ఉండకూడదు. అలాగే 'బుద్బుద వేధ' దోషం కలిగి ఉన్న క్షేత్రంలో గృహ నిర్మాణం చేయకూడదు. స్థలం నైసర్గికం ననుసరించి బాగున్నప్పటికీ, స్థలం స్వభావ రీత్యా ఇలాంటి ప్రతికూల ఫలితాలు కలుగచేస్తుంది. ఈ వేధ వున్న గృహంలో నివసిస్తున్నట్లయితే అనేక విధాల హీన స్థితికి చేరుకోవలసి ఉంటుంది.

ముఖ్యంగా కుటుంబ నాశనం, పశు క్షయం మొదలైన దుష్ఫలితాలు కలగటమే గాక ఇల్లు పరుల వశం అయ్యే అవకాశాలు కూడా ఉంటాయి.

బావులలో కొంత లోతు వరకు వచ్చే నీటి ఊటకు, బుద్బుదమునకు చాలా వ్యత్యాసం ఉన్నది. గృహావరణలో వాస్తు నియమాలకు అనుగుణంగా బావి ఉండటం దోషం కాదు. కానీ గృహావరణలో బుద్బుదములు ఎక్కడ ఉన్నా దోషమే అవుతుంది. చాలావరకు వీటిని నిర్మూలించటం లేదా తరలించటం కష్టసాధ్యమవుతుంది. అది కూడా సాధ్యం కానప్పుడు ఆ స్థలాన్ని విసర్జించటమే ఉత్తమం.



## ఆ విధంగా నిర్మించాల్సి వచ్చింది..!

**ఎస్.ఫణి, హైదరాబాద్**

**ప్రశ్న: మేం ఇల్లు నిర్మించి సుమారు ఎనిమిది సంవత్సరాలు అవుతోంది. దిక్సూచికి ముగ్గు పోసినందుకు అలా ఇల్లు కట్టాల్సి వచినచంది.**

**జవాబు:** ఒక స్థలం దిక్కును అనుసరించి, స్థలానికి అనుగుణంగా గృహ నిర్మాణం చేయాలి. కానీ దిక్కులకు నేరుగా లేని స్థలంలో, దిక్కులకు నేరుగా గృహ నిర్మాణం చేయకూడదు. ఈ విధమైన నిర్మాణాల వలన చెడు ఫలితాలు అనేకం ఉంటాయి. యజమాని గృహాన్ని వదలి వెళ్లిపోవటం, ప్రతికూల వైరాగ్యం పొందటం, దేశదిమ్మరి అవటం, ఇంటి మీద ఆపేక్ష లేకపోవటం, వ్యతిరేక భావాలకు లోనవటం మొదలైన దుష్ఫలితాలు పొందవచ్చు.

కట్టుబడి విధానాన్ని అనుసరించి వివిధ రకాల సమీకరణల వలన కలిగే ఫలితాలలో తీవ్రత హెచ్చుతగ్గులుగా ఉండవచ్చు. ఈ గృహం వారికే కాకుండా, దీనికి ఇరుగు-పొరుగు ఉన్న గృహాలకు ఈ గృహం నుండి మూలపోటు దోషం కలగటం వలన వారు కూడా అనేక విధాల ప్రతికూల ఫలితాలను పొందే అవకాశం ఉంటుంది.

ఈ విధమైన నిర్మాణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ చేయకూడదు. ఒకవేళ చేసినట్లయితే పైన తెలిపిన ప్రతికూల ఫలితాలను అనుభవించక తప్పదు. ఇటువంటి హీనమైన, కఠినమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లయితే తగిన వాస్తు నిపుణుల సలహా తీసుకొని వారి పర్యవేక్షణలో సరిచేసుకోవటం మంచిది. విషయం తెలిసిన తరువాత నిర్ణయం తీసుకోవటంలో ఆలస్యం చేయటం ఏమాత్రం సముచితం కాదు.

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే,
రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ................................................
పుట్టిన తేది : ................................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ................
చిరునామా:................................................

- ఉపయోగపడని శాంతికంటే, ఉపయోగకరమైన సంఘర్షణ మేలు.

- దైవం ఎప్పుడూ గొప్ప సైన్యం పక్షపాతి.

# సంజీవరాయుని నివాసం 'అర్ధగిరి'

వాల్మీకి మహర్షి రచించిన ఆదికావ్యం అవతార పురుషుని గాథ 'శ్రీమద్రామాయణం'. శ్రీరాముని జీవిత చరిత్ర తెలియచేసే పవిత్ర ఇతిహాసం. రామాయణంలోని ఏడు కాండాలలో ధర్మం, సత్యనిష్ఠ, మమతానురాగాలు, సోదర అనుబంధం, స్వామిభక్తి కనిపిస్తాయి.

కిష్కింధ కాండలో ప్రవేశిస్తాడు రుద్రాంశసంభూతుడు వానర వీరుడు వాయునందనుని కుమారుడు అయిన హనుమంతుడు. ఆయన ప్రవేశంతో రామాయణ కావ్య గమనం ముఖ్యమైన మలుపులు తీసుకొంటుంది.

సుగ్రీవునితో స్నేహం, వాలి సంహారం, వానర సేన సీతాన్వేషణకు బయలుదేరడం, దక్షిణ దిశగా వెళ్లిన ఆంజనేయుడు సాగరం దాటి లంకను చేరుకొని సీత దేవిని దర్శించుకోవడం జరుగుతాయి.

అక్షయ కుమార సంహారం, లంకా దహనం, అమ్మవారి నుండి చూడామణి ఆనవాలుగా తీసుకొని కిష్కింద చేరుకోవడం కూడా సుందర కాండలోని అతి ముఖ్య ఘట్టాలు.

వానర సేనతో రావణుని పైకి దండ యాత్రకు తరలి వెళ్లి, సేతువు నిర్మించడం వానర రాక్షస యుద్ధ ప్రారంభం అన్నింటా మారుతీ నందనుని ప్రత్యక్ష ప్రమేయం కనపడుతుంది. అన్నింటికన్నా ముఖ్యమైనది సంజీవని పర్వతాన్ని తీసుకొనిరావడం.

మాయా యుద్ధంలో ప్రవీణుడైన రావణ కుమారుడు మేఘనాథుడు (ఇంద్రజిత్తు) ప్రయోగించిన అస్త్రం వలన గాయపడి,మూర్ఛితుడవుతాడు. ఎన్ని సపర్యలు చేసినా స్పృహలోకి రాకపోవడంతో వానర వైద్యుడు సుషేణుడు "సంజీవని మూలికా తేవాలని" చెబుతారు.

హిమాలయ పర్వత శ్రేణిలోని భాగమైన ద్రోణగిరి అనేక మహిమాన్విత రోగ నివారణ గుణాలు కలిగిన వృక్షాలకు ప్రసిద్ధి. ద్రోణగిరి మీద పెరిగే చిన్న మొక్క కూడా ప్రభావంతమైన మూలికా గుణాలను కలిగి ఉంటుంది. ప్రాణాలను నిలబెట్టగల సంజీవని లభించేది కూడా ద్రోణగిరి మీదనే !

వాయువేగంతో చేరుకొన్న హనుమంతుడు అనుభవరాహిత్యం వలన మూలికను గుర్తించలేక ద్రోణ గిరిని తీసుకొని లంకలోని యుద్ధ భూమికి చేరుకొన్నారు.

ఈ కారణంగా అంజనా సుతుని 'సంజీవ రాయడు' అని కూడా పిలవసాగారు. ఆకాశ మార్గాన పర్వతాన్ని తీసుకొని వచ్చే క్రమంలో కొన్ని భాగాలు భూమి మీద పడినట్లుగా తెలుస్తోంది. పవిత్ర పర్వత భాగాలు పడిన ప్రదేశాలన్నీ కూడా వనమూలికలు ప్రసిద్ధి చెందాయి. అన్నీ కూడా హనుమత్



నివాసాలుగా పేరొందాయి. ఆయా క్షేత్రాలలో రామబంటు శ్రీ ప్రసన్న, శ్రీ దాస, శ్రీ వీర, శ్రీ భక్త శ్రీ అభయహస్త హనుమంతునిగా దర్శనం ప్రసాదిస్తారు. కొన్ని చోట్ల పంచ ముఖునిగా కూడా కొలువై ఉంటారు.

అలాంటి విశేష క్షేత్రాలలో ఒకటి చిత్తూరు జిల్లాలోని 'అర్ధగిరి' లేదా 'అరకొండ'.

## క్షేత్ర గాథ

క్షేత్ర పురాణ గాథ త్రేతాయుగం నాటిదిగా చెప్పుకొన్నాం. కలియుగంలో అనేక మంది రాజవంశాలవారు, స్థానిక పాలకులు, ధనవంతులు అయిన భక్తులు ఆలయాభివృద్ధికి విశేష కృషి చేసారని దినదినాభివృద్ధి చెందుతున్న ఆలయ సముదాయాన్ని చూస్తే అర్థం అవుతుంది.

చిన్న గుట్ట మీద నెలకొని ఉన్న ఈ క్షేత్రంలో ప్రధాన అర్చనామూర్తి శ్రీ ఆంజనేయుడు. సహజంగా దేవాలయాలలో శ్రీ ఆంజనేయస్వామి తూర్పు ముఖంగా దర్శనమిస్తారు. అరుదుగా దక్షిణా ముఖంగా కొలువై ఉంటారు. వీటికి భిన్నంగా అత్యంత అరుదైన ఉత్తరాభి ముఖంగా పవన సుతుడు కొలువై ఉన్న దేవాలయం.

ఉషోదయంలో శ్రీ సూర్యనారాయణుడు తన నులి వెచ్చని కిరణాలతో శిష్యపరమాణువును ఆశీర్వదించడం ఈ ఆలయానికి వున్న మరో ప్రత్యేకత.

శ్రీరామ సన్నిధి, శివాలయంతో పాటు శ్రీ గణపతి, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ ధర్మశాస్త, నాగప్రతిష్ఠలు కూడా దర్శించుకోవచ్చు. ఎత్తైన అయిదు అంతస్థుల రాజగోపురంతో పరిశుభ్ర పరిసరాలతో శోభాయమానంగా ఉంటుంది ఆలయం.

అభయ హస్తంతో, గద ధరించి దర్శనమిచ్చే స్వామి రూపురేఖలను బట్టి ఆంజనేయ ఉపాసకులు శ్రీ కృష్ణదేవరాయల వారి ఆధ్యాత్మిక గురువైన శ్రీ వ్యాస రాయల వారి ప్రతిష్ఠ అని భావిస్తారు. దీనికి నిదర్శనంగా ఇదే..



ఎందరో భక్తులు సుదూర ప్రాంతాల నుండి వచ్చి ఇక్కడ స్వామిని సేవించుకొని నుండి నీటిని తీసుకొని వెళుతుంటారు. ఎన్ని రోజులు ఉంచినా నీరు పాడవక పోవడం వలన ఔషధ గుణాలు కలిసి ఉన్నాయని కూడా నమ్ముతారు.

రూపంలో ఏర్పాటు చేసిన విజయనగర పాలకుల కాలం నాటి హనుమంతుని ఆలయాలను ప్రస్తావిస్తారు.

### పుష్కరిణి

అరుదైన వనమూలికలకు నిలయమైన సంజీవని పర్వత భాగమైన ఈ చిన్న కొండ మీద సహజసిద్ధంగా ఏర్పడిన పుష్కరిణి చాలా ప్రత్యేకం. ప్రవాహ మార్గంలో అనేక దివ్య ఔషధ మూలికల సారాన్ని నింపుకున్న ఈ నీటిని అనేక రోగాలను నయం చేసే శక్తి ఉన్నదని భక్తులు విశ్వసిస్తారు.

ముఖ్యంగా కీళ్ల నొప్పులు, చర్మవ్యాధులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధుల నుండి ఉపశమనం కలుగుతుంది అని చెబుతారు.

### క్షేత్ర ఉత్సవాలు

ప్రతినిత్యం ఉదయం ఆరు నుండి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు; తిరిగి సాయంత్రం అయిదు గంటల నుండి రాత్రి ఎనిమిది గంటల వరకు వరకు తెరిచి ఉంటుందీ ఆలయం. నిర్ణయించిన అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు, ఆరగింపులు జరుపుతారు. భక్తుల కోసం కొన్ని ఆర్జిత సేవలు కూడా అందుబాట్లో ఉన్నాయి.

గణపతి నవరాత్రులు, మహా శివరాత్రి, శ్రీరామ నవమి, శ్రీ హనుమజ్జయంతి అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. జిల్లా నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలోని సమీప ప్రాంతాల భక్తులు కూడా పెద్ద సంఖ్యలో తరలి వస్తారు.

పౌర్ణమి రోజులలో విశేష సంఖ్యలో భక్తులు వస్తారు. ప్రత్యేక పూజలు, గిరి ప్రదక్షిణ కూడా చేస్తారు.

భక్తులకు లభిస్తున్న శుభ ఫలితాలతో ఆలయం అభివృద్ధి నిరాటంకంగా కొనసాగుతోంది. చుట్టూ పచ్చని పొలాలు, మామిడి తోటలతో ఆహ్లాదకర పచ్చని వాతావరంలో నెలకొని ఉన్న అర్ధగిరి శ్రీ ఆంజనేయస్వామి ఆలయం చిత్తూరు జిల్లాలో నెలకొని ఉన్నది. ప్రముఖ స్వయంభూ వినాయక క్షేత్రమైన కాణిపాకంకు సుమారు పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉంటుంది అర్ధగిరి.

తిరుపతి, చిత్తూరు, కాణిపాకం నుండి నేరుగా రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు. బస్సులు చిత్తూరు, కాణిపాకం నుండి లభిస్తాయి. వసతి సౌకర్యాలు లభించవు.

**– ఇలపావులూరి వెంకటేశ్వర్లు**

---

# అద్భుత గూఢచారి

**మైసూర్** టిప్పుసుల్తాన్ వంశానికి చెందిన అందమైన తెలివిగల ఆ యువతి డిటెక్టివ్ గూఢచారిగా పనిచేసి హిట్లర్ నాజీలను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ల తాగించింది. ఆమె పేరు నూర్ ఇనాయత్ ఖాన్.

నూర్ తండ్రి హజరత్ ఇనాయత్ ఖాన్, అతడు టిప్పు వంశస్థుడు. తల్లి అమెరికన్. నూర్ పుట్టింది ఫ్రాన్స్‌లో. పుస్తకాలు, సంగీతంతో ఆమె బాల్యం గడిచింది. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీలు ఫ్రాన్స్‌పై దాడి చేయటంతో ఆమె కుటుంబం పారిస్‌ని వదిలి బ్రిటన్‌లో తలదాచుకుంది.

బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్‌గా, వైర్లెస్ రేడియో ఆపరేటర్‌గా 1943లో ఫ్రాన్స్ చేరింది. పదిహేను కిలోమీటర్లు సైకిల్‌పై, మూడు వందల కిలోమీటర్లు పారిస్‌కి రైలులో వెళ్లింది. ఫ్రెంచ్ మహిళగా జా మెరీ రెనియా అనే మారు పేరుతో నాజీలకు చిక్కకుండా తన తడాఖా చూపింది. రహస్య సమాచారం బ్రిటన్‌కి పంపేది. అలా వంద రోజులు గడిచాయి.

కానీ తోటి ఉద్యోగిని ఈమె అందచందాలు, తెలివికి ఈర్ష్య పడి జర్మన్లకి నూర్ గురించి సమాచారం అందించింది. ఇంకేముంది!? నాజీలు ఆమెను చిత్రహింసలు పెట్టారు. ఆపై కాల్చి చంపారు. 1949లో బ్రిటన్ తమదేశ జార్జి క్రాస్ పురస్కారం, స్టాంపు విడుదల చేసింది.

లండన్‌లో ఆమె విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఫ్రాన్స్ తమ ఉత్తమ పౌరురాలుగా ప్రకటించింది. భారతీయ మూలాలున్న ఈ యువతిని ముప్పై ఏళ్ల ఆమెని గూఢచారి అనే నెపంతో నాజీలు చంపేసినా, ఆమె నేటికీ అమరజీవి.

**సేకరణ: అచ్యుతుని రాజ్యశ్రీ**

## పుస్తక సమీక్ష

## కలం ఆయుధంగా..



మేధావంతులైన ఎడిటర్‌లు, తమ సంపాదకీయాలలో అభిప్రాయాలను ప్రస్తావిస్తూ చైతన్యవంతంగా జనజీవనాన్ని నడిపిస్తుంటారు. ఆ కోవలో పత్రికా రచయిత డా. నీలం సంపత్ విద్యావేత్తగా, సామాజిక కార్యకర్తగా, సామాజిక స్పృహగల బాధ్యతాయుత రచయితగా ఈ సంపుటిలోని వ్యాసాలు వర్తమాన స్థితిగతులపై తట్టిలేపుతున్నాయి. అధికారమే పరమావధిగా అర్రులు చాస్తున్న రాజకీయ నేతలకు కనువిప్పు కలిగించే అంశాలను డా.సంపత్ ఇతివృత్తాలుగా తీసుకున్నారు. ఎన్నికల ప్రలోభాలతో రాజ్యాధికారం పొంది, రాజకీయ వ్యాపారంలో కోట్లకు పడగలెత్తుతున్న రాజకీయ నాయకులపై 'డేంజర్‌లో డెమొక్రసీ' వంటి వ్యాసాలు ఈ సంపుటిలో ఉన్నాయి. ఢిల్లీ కాలుష్యం, తొక్కిసలాట మరణాలు, ఆకలిచావులు, పరీక్షల ఒత్తిళ్లు, కస్టడీ మరణాలు, మహిళల మిస్సింగ్, డ్రగ్స్ మత్తు, ప్లాస్టిక్ భూతం, మద్యపానం, కల్తీ మాఫియా, పోడురైతుల వెతలు, క్షుద్రపూజలు, అమానవీయ హత్యలు ఏ అపసవ్యమైనా, అరిష్టమైనా, అనాలోచితమైనా, ఏ సామాజిక రుగ్మత అయినా నిర్మొహమాటంగా నిలదీసారు. రాజకీయ పార్టీల ఆధ్వర్యంలోని ఛానెల్స్ చేసుకుంటున్న ఆరోపణలు, ప్రత్యారోపణల వెల్లువలో కొట్టుకుపోతున్న వీక్షకులు ఏది నిజమో ఏది అబద్ధమో తెలుసుకోలేక తీవ్ర గందరగోళానికి గురి అవుతున్నారనే యదార్థాలు ఎన్నో డా॥ సంపత్ ఈ వ్యాసాలలో వివరించారు.

**(సోషల్ పర్‌స్పెక్టివ్స్-రచన: డా.నీలం సంపత్; వెల: రూ.250/-లు; ప్రతులకు: డా.నీలం సంపత్, 8-1-546, వినాయక్ నగర్, రోడ్ నం.1, కట్టారాంపూర్, కరీంనగర్ జిల్లా)**

## పరకాయ ప్రవేశంతో సాంఘిక అద్భుతం

పోట్లూరు సుబ్రహ్మణ్యం రచించిన 'ప్రేమపూజారి-నిత్యసన్యాసి' రొమాంటిక్ కామెడీ నవల, పరకాయ ప్రవేశం ఇతివృత్తంగా చదువరులను ప్రేమ, రొమాన్స్ మిళితంగా ఆకట్టుకొంటుంది. రాంబాబు, గున్నయ్య, కీర్తన ప్రధాన పాత్రలుగా రచయిత అద్భుత ఊహల సృజనాత్మక కథనం సృష్టించారు. పరుల శరీరంలో ప్రవేశించటం సాహసం అనే సూత్రం ఆధారంగా రచయిత పాత్రల ఆత్మల స్వరూప స్వభావాలను కథారూపకంగా కల్పించి కథ నడిపించారు. హాస్య సృష్టి కోసం అయినా, రొమాన్స్‌నైనా వెకిలితనం కనపడదు. అరేబియా సముద్రం మధ్యలో వుండే మిస్టీరియస్ డెత్ ఐలాండ్‌లో పరకాయ ప్రవేశ విద్య, అభేద్యమైన మరణదీవి, ఆత్మలు శరీరంలో ప్రవేశం, సముద్ర గర్భంలో గ్లాస్ హాల్, ప్రేమపూజారి రొమాన్స్ అన్నీ నిజం అనిపించేటట్టుగా రచయిత కల్పించారు.

ప్రేమపూజారి, నిత్యసన్యాసి రెండు పాత్రలు ఈ నవలలో అపురూప అసాధారణ మలుపులతో పోట్లూరు సుబ్రహ్మణ్యం తెలుగు నవలా సాహిత్యంలో వినూత్న అద్భుత కథన కల్పనకు ఆద్యునిగా అభినందనీయులు.

**(ప్రేమపూజారి-నిత్యసన్యాసి(నవల); రచన: పోట్లూరు సుబ్రహ్మణ్యం; వెల: రూ.250/-లు; ప్రతులకు: పోట్లూరు సుబ్రహ్మణ్యం, 601, రెవెన్యూ కాలనీ, చంద్రబాబు నగర్ రోడ్, ఆంధ్రకేసరి నగర్(పోస్ట్), నెల్లూరు-524 004, ఆంధ్రప్రదేశ్)**

## గీతలో గోమాత ప్రాశస్త్యం



గోస్వామిగా సాహితీ ప్రస్థానాన్ని, గోసేవకు జీవితాన్ని అంకితం చేసి, గోమాత ప్రాచీన వైభవ అద్భుత శక్తిని, మహత్యాన్ని ప్రస్తుత సమాజం గోమాతను ఆరాధ్యనీయంగా గోరక్షణతో వినియోగించుకోవాలని నిరంతరం తపించే డా॥ నిట్టల గోపాలకృష్ణ 'గీతామాత-గోమాత' వెలువరించారు. భారతీయ ఆధ్యాత్మిక మహోన్నతకు మూలాధారమైన గీతామాత-గోమాతల అనుబంధం ఈ గ్రంథం వివరిస్తోంది. భగవద్గీతలోని సుమారు 200 శ్లోకాలను ఏర్చికూర్చి, సరళమైన భాష, అందరి అవగాహనకు అందేవిధంగా డా.గోపాలకృష్ణ వ్యాఖ్యాన సహితంగా అందించారు. మనుషులు మొదలైన సమస్త ప్రాణికోటికి గోవులే జీవన ఆధారం, కల్యాణ కారకం అన్ని కాలాలలో శుభాన్ని అందచేస్తాయని, గోవు అమృత తత్వాన్ని సంరక్షిస్తే దేశం శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లుతుందనే సందేశం ఈ పుస్తకం అందిస్తోంది. 112వ శ్లోక అంతరార్థంగా డా॥ గోపాల కృష్ణ ఇలా వ్యాఖ్యానించారు. గోహత్య చేసేవారు, గోమాంసం తినేవారు, గోవులను చంపటం సమర్థించేవారు గోవు శరీరం మీద ఎన్ని రోమాలుంటాయో అన్ని సంవత్సరాలు నరక బాధలు అనుభవిస్తారు. గోగీత లఘుచిత్ర నిర్మాత, 8 నంది అవార్డుల స్వీకర్త, గోతులాభార రూప శిల్పి గోస్వామిగా, గోమాత అద్భుత మహత్యాన్ని చాటిచెప్తున్న డా॥ గోపాలకృష్ణ ధన్యాత్మగా ప్రశంసలు పొందుతున్నారు.

**(గీతామాత-గోమాత-రచన: గోస్వామి డా.నిట్టల గోపాలకృష్ణ; ప్రతులకు: గోమాత సేవా ట్రస్ట్, 202, శివసాయి సదన్, శ్రీనివాసపురం, రోడ్-3, రామంతపూర్, హైదరాబాద్)**

– జయసూర్య

# 28 జూన్, 2026 నుండి 4 జులై, 2026 వరకు



## వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి,ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795



### మేషం

ఈ వారం పట్టుదలతో ముందుకు సాగుతారు. పూర్వపు మిత్రుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. మాటల చాతుర్యంతో అందరిని ఆకట్టుకుని లబ్ధి పొందుతారు. వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు. షేర్లు, భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. గృహం, స్థలాలు కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. విందు, వినోదాలలో పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా వుంటుంది.



### వృషభం

ఈ వారం నూతన పరిచయాలు పెరుగుతాయి. పెట్టుబడులకు లాభాలు పొందుతారు. అప్రయత్న కార్యసిద్ధి మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. దూరపు బంధువులను కలుసుకుని ముఖ్యవిషయాలు చర్చిస్తారు. ఇంటర్వ్యూలకు హాజరువుతారు. భాగ స్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు హోదాలు దక్కుతాయి. కళారంగాల వారికి యోగ దాయకంగా ఉంటుంది. కుటుంబ సభ్యులతో కలిసి విందు,వినోదాలు.



### మిథునం

ఈ వారం ఆదాయ వ్యయాలలో సమతుల్యత లోపించ కుండా జాగ్రత్తలు తీసుకుంటారు. మీ అంచనాలు ఫలిస్తాయి. విదేశీయాన యత్నాలు కలిసి వస్తాయి. కృషి వ్యర్థము కాదు అన్న సంగతి కొన్ని సంఘటనల వలన ఋజువు అవు తుంది. ప్రతిష్టకు పోకుండా చర్చలతో సమస్యలను పరిష్కరించు కుంటారు. ప్రత్యర్థుల రాజకీయ పలుకుబడి మీ విషయంలో పని చేయదు. గతంలో ఒదులుకున్న అవకాశాలను తిరిగి దక్కించుకుంటారు.



### కర్కాటకం

ఈ వారం వ్యవహారాలు అనుకున్న విధంగా సాగుతాయి. సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. శత్రువులు సైతం మిత్రులుగా మారి సహాయం అందిస్తారు. భూములు, భవనాలు, స్థలాలు కొనుగోలు చేస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు.



### సింహం

ఈ వారం శుభకార్యాలలో పాల్గొంటారు. తక్కువ పెట్టుబడితో నూతన వ్యాపారాలకు శ్రీకారం చుడతారు. మీకు అండగా నిలబడతారు అని ఆశించిన ఓ వర్గం వారు సకాలంలో అందుబాటులో లేకపోవడం లోటుగా పరిణమిస్తుంది. మీలో మొండితనం, పట్టుదల అధికమవుతున్నట్లుగా భావిస్తారు. కార్యాలయంలో ఉన్నతాధికారుల మెప్పు లభిస్తుంది. నిత్యం తెల్లజిల్లేడు వత్తులతో గణపతి సన్నిధిలో దీపారాధన చేయాలి.



### కన్య

ఈ వారం పాత సమస్యలే కొత్తకోణంలో తారసపడడం, వాటిని పరిష్కరించుకోవలసి రావడం జరుగుతుంది. ఎన్ని జాగ్రత్తలు పాటించినప్పటికీ ఒక సమస్యను పరిష్కరిస్తే మరో సమస్య ఎదురవుతుంది. వృత్తి, ఉద్యోగాల పరంగా శ్రమ అధికమవుతుంది. అయినప్పటికీ మీ శ్రమలో ఎటువంటి లోపం ఏర్పడదు. చిన్నపాటి అనారోగ్య సమస్యలు లెక్కపెట్టేవిగా ఉండవు. నిత్యం అష్టమూలికా గుగ్గిలంతో ధూపం వేయడం చెప్పదగినది.



### తుల

ఈ వారం సోదరి వర్గానికి సహాయం అందిస్తారు. పలుకుబడి కలిగిన వ్యక్తులను కలుస్తారు. ప్రయాణాలు లాభిస్తాయి. విద్యపైన అధికశ్రద్ధను చూపగలుగుతారు. ఆర్థిక పరిపుష్టిని సాధించడానికి తగు మార్గాలను అన్వేషిస్తారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. రాజకీయ, పారిశ్రామిక రంగాలలోని వారికి అనుకూలంగా వుంటుంది. అరుదైన ఆహ్వానాలు అందుతాయి. గతంలో తిరస్కరించిన కొన్ని అంశాలను తిరిగి పరిగణలోనికి తీసుకుంటారు.



### వృశ్చికం

ఈ వారం ఇంతకాలం పడ్డ శ్రమ ఫలిస్తుంది. పనులు సాఫీగా సాగుతాయి. సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమై ఊరట చెందుతారు. నూతన ఉద్యోగ, విద్యావకాశాలు లాభిస్తాయి. వాహనాలు ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ప్రత్యర్థులు మిత్రులుగా మారి చేయూత నందిస్తారు. వృత్తి, వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఉద్యోగులకు కలిసి వచ్చే కాలం. పారిశ్రామిక, కళారంగాల వారికి సన్మానయోగం.



### ధనస్సు

ఈ వారం పనులు నిదానంగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి కొంత వరకు మెరుగుపడుతుంది. నూతన ఒప్పందాలు చేసుకుంటారు. వివాహ, ఉద్యోగ యత్నాలు సాగిస్తారు. బంధుమిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. వివాదాలకు దూరంగా ఉండండి. ఉద్యోగులకు స్థానచలనం ఉంటుంది. దూరప్రాంతాల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధిని సాధిస్తారు. విద్యార్థులు నిత్యం సరస్వతీ తిలకం ధరించడం శ్రేయోదాయకం.



### మకరం

ఈ వారం ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. కొత్త పెట్టుబడులకు అనుకూలమైన కాలం. బంధువుల నుండి అందిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. శత్రువులను మిత్రులుగా మార్చుకుంటారు. మీ తెలివితేటలు నైపుణ్యం వెలుగులోకి వస్తాయి. ఆస్తి వివాదాలు తీరి ఊరట చెందుతారు. బాధ్యతలు నెరవేరుస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు పదోన్నతుల సూచన. పారిశ్రామిక రంగాలవారికి విదేశీ పర్యటనలు దీర్ఘకాలిక బాకీలు వసూలవుతాయి.



### కుంభం

ఈ వారం చేపట్టిన పనులలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. కుటుంబ సమస్యలు పరిష్కారమ వుతాయి. కోపతాపాలకు, వివాదాలకు దూరంగా వుండడం మంచిది. అష్ట గణపతికి ప్రతిరోజు సిద్ధగంధంతో పూజచేయటం వలన అన్ని విధాలుగా శ్రేయస్కరం. సంఘసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్నా అవసరాలకు డబ్బు అందుతుంది. ఆరోగ్యం, వాహనాల విషయా లలో నిర్లక్ష్యం తగదు. అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు.





### మీనం

ఈ వారం చేపట్టిన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. ఋణాలు తీరుస్తారు. ప్రముఖులను కలుసుకుని ఆసక్తికరమైన విషయాలు తెలుసుకుంటారు. సంఘంలో గౌరవ ప్రతిష్టలు పెరుగుతాయి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. సోదరులను మిత్రులను కలిసి సంతోషంగా గడుపుతారు. వృత్తి, వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి. ప్రయాణాలు అలసటకు గురి చేస్తాయి.

# ఈ వారం కార్టూన్స్


పాతిక సం॥రాల నుండి డాక్టర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారా..? ఐతే ప్రాక్టీస్ అయిపోయాక వస్తా!!
సర్జన్ MS


మనం ఎప్పుడూ వెధవల్తో, చేతగాని దద్దమ్మల్తో, దరిద్రుల్తో పోల్చుకోవాలి.. అప్పుడే మనం గొప్ప అనే ఫీలింగొస్తుంది!!


తలుపు తీసి పెట్టొద్దు.. ఏసీ బయటకు పోతుందని చెప్పానా..? చూడు..!!



అందరూ బోటింగ్ చేస్తున్నారు.. ఇందులో వింతేముంది? అని అనుకోకండి. వియత్నాంలోని టామ్ కాక్ ప్రాంతమిది. ఇక్కడి నో డోమ్ నదిలో చేసే పడవ షికారు మరపురాని అనుభూతులను కలిగిస్తుంది.



